దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,32,200/- (22 క్యారెట్స్)
1,44,220/- (24 క్యారెట్స్)



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 17 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 05-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

వందేమాతరం అననంటున్నరు
వంగి వంగి "అవని"కి మొక్కుతున్నరు.
దీన్ని ఏమంటరు ?

వందేమాతరం అర్థం కాని మనుషులు
పెడర్థాలు తీస్తున్నరు
దుర"దుష్ట" ప్రచారం చేస్తున్నరు.

మనల కన్నతల్లికి ఓ పేరుంది
మనం జీవించే భూబాగానికి ఓ పేరుంది.
ఆ పేరే "భారత" మాత
బ్రతికే భూమి పేరు తలవనంటే
కన్నతల్లి రొమ్ము పట్టినట్టే.

నమ్మిన దేవున్ని వదలమనీ చెప్పలేదు.
ఎవరి ఆచారం మార్చకోమనీ చెప్పలేదు.
శత్రువుకు పక్కలేయకన్నం
కన్నతల్లి రంకులెంచకన్నం.
దేశం కంటే ఏ మతం
గొప్పది కాదని చెబుతున్నం.

"ఒంటి మీది వస్త్రమే"
"మత"మని తెలుసుకోనీ
ఉనికి నీ బ్రతుకు "దేశ"మని మసలుకో.
వందేమాతర గేయం
అందరినీ కలిపి ఉంచు జపమంత్రం
ఇందులో ఏమీ లేదు కుతంత్రం.

( వందేమాతర గేయం ప్రతిపదార్థం
పంపుతున్నాను. అందులో
అనుమానం, అవమానం,
దేవుడు లేదా దేవత పేరు
ఎక్కడ ఉన్నదో తెలుపండి )..

– రాజి రెడ్డి శీలం ..ఇనుగుర్తి.

- కల్తీ మసాలా కేసు దర్యాప్తుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు.
- 13 మసాలా సంస్థలపై మెరుపు దాడులు.
- 25 టన్నుల కల్తీ మసాలాల స్వాధీనం.
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్‌తో మసాలాల తయారీ వెలుగులోకి
- ముగ్గురు అరెస్ట్.. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసుల నమోదు
- కల్తీ ఆహారంతో క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధుల ప్రమాదమని సీపీ సజ్జనార్ హెచ్చరిక.




# కల్తీ మసాలా ముఠాపై సిట్

## హైదరాబాద్ పోలీసుల కీలక నిర్ణయం!

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైదరాబాద్‌లో వెలుగుచూసిన కల్తీ మసాలా తయారీ ముఠా కేసులో పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో తయారు చేసిన టన్నుల కొద్దీ మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**13 సంస్థలపై దాడులు..**
**భారీగా కల్తీ మసాలాల స్వాధీనం**

హైదరాబాద్ ఆహార భద్రత ప్రత్యేక బృందం మెరుపు దాడుల్లో భాగంగా 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు తదితర మసాలాల్లో కల్తీ జరిగినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.

**హానికర రసాయనాలతో తయారీ**

మసాలాల తయారీలో ఫ్యాబ్రిక్ రంగులు, కృత్రిమ రంగులు, టాల్కమ్ పౌడర్, పారిశ్రామిక రంగులు, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హానికర పదార్థాలను వినియోగిస్తున్నట్లు దర్యాప్తులో బయటపడిందని సీపీ తెలిపారు. మసాలాలకు

మిగతా 2లో




# ఐడీ ప్రూఫ్ అడిగితే దాడి

- సనత్‌నగర్ హోటల్‌లో అర్ధరాత్రి వీరంగం!
- హోటల్‌లో గది కోసం వచ్చిన నలుగురు వ్యక్తుల హంగామా
- ఐడీ ప్రూఫ్ అడిగిన హోటల్ సిబ్బందిపై కర్రలతో దాడి
- దాడిలో క్లీనింగ్ సిబ్బంది ఆకాశ్‌కు తీవ్ర గాయాలు
- దాడి అనంతరం పరారైన నిందితులు
- సీసీటీవీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు
- సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి కొందరు యువకులు హోటల్‌లో వీరంగం సృష్టించారు. గది కోసం వచ్చిన నలుగురు వ్యక్తులు ఐడీ ప్రూఫ్ అడిగిన హోటల్ సిబ్బందిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో క్లీనింగ్ సిబ్బంది ఆకాశ్ తీవ్రంగా గాయపడగా, అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**ఐడీ అడగడంతో ఘర్షణ**

భరత్‌నగర్‌లోని ఓ హోటల్‌కు అర్ధరాత్రి వచ్చిన నలుగురు వ్యక్తులు గది కావాలని కోరారు. హోటల్ నిబంధనల ప్రకారం సిబ్బంది ఐడీ ప్రూఫ్ చూపించాలని కోరగా, "మేము లోకల్..

మిగతా 2లో

# ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత



- సినీ పరిశ్రమలో విషాదం
- క్యాన్సర్‌తో పోరాడుతూ 74 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచిన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్
- హిందీ, తెలుగు సహా పలు భారతీయ భాషల్లో 100కు పైగా చిత్రాల్లో నటించి విశేష గుర్తింపు
- 'మహాభారతం' ధారావాహికలో అశ్వద్ధామ పాత్రతో వెలుగులోకి వచ్చిన ప్రదీప్ రావత్
- 'సై', 'గజిని' చిత్రాలతో ప్రతినాయకుడిగా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించిన నటుడు
- ప్రదీప్ రావత్ మృతిపై సినీ ప్రముఖులు, అభిమానుల సంతాపం.

2లో

# త్రిష వ్యాఖ్యల కేసులో అరెస్ట్

## హైకోర్టు ఆదేశాలతో ఉదయనిధి స్టాలిన్ విడుదల!

- నటి త్రిషపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్
- మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ అనంతరం విడుదల చేసిన పోలీసులు
- సెంగిపట్టి పోలీస్ స్టేషన్ వద్దకు భారీగా తరలివచ్చిన డీఎంకే శ్రేణులు
- టీవీకే ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందంటూ స్టాలిన్ తీవ్ర విమర్శలు
- బడ్జెట్ సమావేశాలకు ముందే రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారంటూ డీఎంకే ఆరోపణలు



**చెన్నై, ప్రజా వాయిస్:** నటి త్రిషపై డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో అరెస్టైన తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు విడుదల చేశారు. నీలాంకారై నివాసం నుంచి అరెస్టు చేసిన అనంతరం ఆయనను తంజావూరు జిల్లాలోని సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాదాపు గంటన్నరపాటు విచారించిన పోలీసులు కోర్టు ఆదేశాల ప్రకారం విడుదల చేశారు. స్టేషన్ వెలుపల పెద్ద ఎత్తున చేరుకున్న డీఎంకే కార్యకర్తలు ఉదయనిధికి ఘన స్వాగతం పలికారు.

**హైకోర్టు జోక్యంతో విడుదల**

ఉదయనిధి స్టాలిన్ తరపు న్యాయవాదులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం వెంటనే విడుదల చేయాలని

మిగతా 2లో

# సీఎంఆర్‌పై ఉత్తమ్ కీలక సమీక్ష

- డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలకు సిద్ధం!
- కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవస్థపై సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గత 10-12 ఏళ్ల సీఎంఆర్ వ్యవహారాలపై లోతైన పరిశీలన
- ప్రభుత్వ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలకు నిర్ణయం
- విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిపై సమగ్ర సమీక్ష
- రైతుల ప్రయోజనాల పరిరక్షణ, ప్రభుత్వ నిధుల రక్షణే ప్రధాన లక్ష్యమన్న అధికారులు

2లో

# హైదరాబాద్ లో రెంట్ షాక్

- 2BHKరూ.50 వేల అద్దె.. ఐటీ ఉద్యోగులకు చుక్కలు
- గచ్చిబౌలి, మణికొండ, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్‌లో అమాంతం పెరిగిన అద్దెలు
- వర్క్ ఫ్రం హోమ్ ముగియడంతో ఐటీ కారిడార్‌లో ఫ్లాట్లకు ఊహించని డిమాండ్
- రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దె కోరుతున్న యజమానులు
- అద్దె కంటే ఈఎంఐ మేలంటూ సొంతింటి కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్న ఉద్యోగులు



వర్క్ ఫ్రం హోమ్ ముగియడంతో డిమాండ్ జోరు

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** ఐటీ ఉద్యోగులకు హైదరాబాద్‌లో అద్దె భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు రూ.20–25 వేలలో లభించిన 2BHK ఫ్లాట్లు ఇప్పుడు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దె పలుకుతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి, మణికొండ, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ ప్రాంతాల్లో అద్దెలు రికార్డు స్థాయికి చేరడంతో మధ్యతరగతి ఐటీ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా అనంతరం అమల్లోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం దాదాపు ముగియడంతో వేలాది మంది ఉద్యోగులు తిరిగి కార్యాలయాలకు హాజరవుతున్నారు. దీంతో ఐటీ కారిడార్ పరిసరాల్లో అద్దె ఇళ్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకున్న యజమానులు అద్దెలను భారీగా పెంచేస్తున్నారని ఉద్యోగులు

మిగతా 2లో

# హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు

- "క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ" వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు
- తమిళనాడు, కర్ణాటకలో క్షుద్ర పూజలు నిర్వహించారంటూ ఆరోపించిన మహేశ్ గౌడ్
- ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ప్రజలకు వివరణ ఇవ్వాలని హరీశ్ రావుకు సవాల్
- తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని పూజలు చేశారంటూ విమర్శలు
- ఆరోపణలపై ఇప్పటివరకు హరీశ్ రావు, బీఆర్ఎస్ నుంచి స్పందన లేదు

2లో

# చెమట చిందినా..కూలీ జమ కాలేదు

- కేంద్రం నిధులు విడుదల చేసినా వేలాది మంది ఉపాధి కూలీల ఖాతాల్లోకి చేరని వేతనాలు
- వారం రోజులుగా బ్యాంకులు, గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్న కార్మికులు
- రోజువారీ అవసరాల కోసం అప్పుల బాట పడుతున్న గ్రామీణ పేద కుటుంబాలు
- పెండింగ్ బకాయిలను వెంటనే జమ చేయాలని సంబంధిత అధికారులకు కార్మికుల విజ్ఞప్తి



**ప్రజా వాయిస్,హైదరాబాద్:**గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద పనిచేసిన వేలాది మంది కూలీలు తమ చెమటకు తగిన ప్రతిఫలం కోసం రోజులు లెక్కపెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు సమాచారం వచ్చినప్పటికీ, అనేక మంది కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు ఇంకా జమ కాకపోవడంతో కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది

### బ్యాంకులు... సచివాలయాలే ఆశాకేంద్రాలు

ఈరోజైనా డబ్బులు వచ్చాయేమో అన్న ఆశతో కూలీలు ఉదయం నుంచి బ్యాంకులు, గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఖాతాలు చెక్ చేసుకున్నా నిరాశే ఎదురవుతోందని, ఎప్పుడు వస్తాయో చెప్పే పరిస్థితి కూడా లేదని వారు వాపోతున్నారు. అధికారుల వద్దకు వెళ్లినా స్పష్టమైన సమాధానం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పొయ్యి వెలిగించాలంటే అప్పులే దిక్కు

రోజువారీ కూలీతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్న పేదలకు ఈ ఆలస్యం తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇంట్లో నిత్యావసర సరుకులు కొనాలన్నా, పిల్లల చదువుల ఖర్చులు భరించాలన్నా, అనారోగ్యానికి మందులు కొనాలన్నా చేతిలో డబ్బు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు చెబుతున్నారు. పని చేసినా కూలీ అందకపోవడం తమను మరింత కష్టాల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విడుదలైన నిధులు... ఖాతాల్లోకి ఎందుకు రావడం లేదు.?

కేంద్రం నుంచి నిధులు విడుదలైనట్లు సమాచారం ఉన్నప్పటికీ, కూలీల ఖాతాల్లో జమ కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక సమస్యలా? లేక పరిపాలనా జాప్యమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

కుటుంబ పోషణ పూర్తిగా ఉపాధి హామీ కూలీపైనే ఆధారపడుతున్నందున ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పని చేసిన కూలీ సమయానికి అందితేనే పథకం లక్ష్యం నెరవేరుతుంది అని వారు స్పష్టం చేస్తున్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి గ్రామీణ పేదల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

# హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారని, ఇందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అరుంధతి సినిమాలో చూపించిన తరహాలో ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆరోపించారు.

### రెండు తేదీలపై వివరణ ఇవ్వాలని డిమాండ్

ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు హరీశ్ రావు వెళ్లారని, ఆ రోజుల్లో ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారో చెప్పాలని ప్రశ్నించారు.

### ప్రజలకు కీడు జరగాలని పూజలంటూ ఆరోపణ

తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ హరీశ్ రావు క్షుద్ర పూజలు చేశారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని, కానీ రాజకీయ స్వార్థం కోసం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేయడం బాధాకరమని విమర్శించారు.



### లీగల్ నోటీసులకు భయపడబోమన్న టీపీసీసీ చీఫ్

ఈ అంశంపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అయితే అలాంటి నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు.

### కేసీఆర్‌పైనా ప్రస్తావన

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా గతంలో అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో ఆ ప్రచారంపై కూడా అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి చేసిన పూజల గురించి ప్రజలకు హరీశ్ రావు వివరించాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ లో రెంట్ షాక్

మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు.

### అద్దె పెంపుతో నెలవారీ బడ్జెట్ గందరగోళం

ఇంటి అద్దెతో పాటు మెయింటెనెన్స్, కరెంట్, పార్కింగ్, ఇతర ఖర్చులు కలిపి నెలకు రూ.60 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. జీతంలో పెద్ద భాగం అద్దెకే వెళ్లిపోవడంతో పొదుపు చేయడం కష్టమవుతోందని అంటున్నారు.

### సొంతింటి వైపు చూపులు

ప్రతి నెలా భారీ అద్దె చెల్లించే బదులుగా అదే మొత్తంతో ఈఎంఐ కట్టి సొంతింటిని కొనుగోలు చేయడమే మంచిదనే అభిప్రాయం ఐటీ ఉద్యోగుల్లో పెరుగుతోంది. దీంతో నగర శివారు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలపై ఆసక్తి పెరుగుతోందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి.

### అద్దెలకు అడ్డుకట్ట ఎప్పుడు..?

ఐటీ ఉద్యోగుల సంఖ్య పెరగడం, కొత్త ప్రాజెక్టులు రావడం, కార్యాలయాలకు తిరిగి హాజరు తప్పనిసరి కావడం వంటి కారణాలతో రానున్న రోజుల్లోనూ అద్దెలు మరింత పెరిగే అవకాశముందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో హైదరాబాద్‌లో అద్దె ఇల్లు అనేది ఇప్పుడు ఉద్యోగులకు పెద్ద ఆర్థిక సవాలుగా మారింది.

# ఐడీ ప్రూఫ్ అడిగితే దాడి



మొదటి పేజీ తరువాయి

ఐడీ ఎందుకు?" అంటూ వారు వాగ్వాదానికి దిగారు. ఆధార్ కార్డు అడగడాన్ని వ్యతిరేకిస్తూ వివాదం ఘర్షణకు దారితీసింది.

### కర్రలతో దాడి.. ఉద్యోగికి గాయాలు

వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో నిందితులు కర్రలతో హోటల్ సిబ్బందిపై దాడి చేశారు. ఈ దాడిలో క్లీనింగ్ సిబ్బంది ఆకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. హోటల్‌లోని ఇతర ఉద్యోగులు వెంటనే అతడిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

### సీసీటీవీ ఆధారంగా దర్యాప్తు

దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనపై హోటల్ యాజమాన్యం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు హోటల్‌లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# కల్తీ మసాలా ముఠాపై సిట్

మెరుపు, ఆకర్షణీయమైన రంగు తీసుకురావడానికి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి నాణ్యమైన మసాలాలుగా విక్రయిస్తున్నారని వెల్లడించారు. ఈ దాడుల్లో 89 టన్నులకుపైగా ముడి పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

### కఠిన చర్యలు.. ప్రజలకు హెచ్చరిక

కల్తీ మసాలాల నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఆహార భద్రత చట్టం ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల వినియోగంతో కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలను అప్రమత్తం చేశారు.

### 140 రోజుల్లో 246 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం

ఆహార భద్రత ప్రత్యేక బృందం ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు. మొత్తం 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనుమానాస్పద ఆహార పదార్థాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత



**ముంబై, ప్రజా వాయిస్:** ప్రముఖ బాలీవుడ్, టాలీవుడ్ నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన సహనటుడు యశ్‌పాల్ శర్మ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ప్రదీప్ రావత్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

### నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణం

ప్రదీప్ రామ్ సింగ్ రావత్‌గా జన్మించిన ఆయన 1985లో రాజ్ బబ్బర్ నటించిన 'ఐత్‌బార్' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. అనంతరం బీఆర్ చోప్రా నిర్మించిన 'మహాభారతం' ధారావాహికలో అశ్వద్ధామ పాత్ర పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

### 'సై'తో తెలుగు చిత్రసీమలో సత్తా

2004లో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'సై' చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఆ సినిమా విజయంతో తెలుగు సహా దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని 100కు పైగా తెలుగు చిత్రాల్లో నటించారు.

### లగాన్', 'గజిని'తో జాతీయ గుర్తింపు

2001లో విడుదలైన 'లగాన్' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రదీప్ రావత్, అనంతరం 'గజిని' చిత్రంతో హిందీ చిత్రసీమలో అగ్రశ్రేణి ప్రతినాయకుడిగా పేరు సంపాదించారు. తన విలక్షణ నటనతో పలు భారతీయ భాషల్లో ప్రేక్షకులను అలరించారు.

### సినీ లోకంలో విషాదం

గత నెల విడుదలైన 'గాయపడిన సింహం' చిత్రంలో చివరిసారిగా కనిపించిన ప్రదీప్ రావత్ మరణంతో సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే సినీ ప్రముఖులు, అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేస్తూ, భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.




# కమిషనరేట్ గడప వద్దే ఆగిపోతున్న ఫిర్యాదులు

- సీపీని కలిసే అవకాశం లేక నిరాశతో వెనుదిరుగుతున్న బాధితులు
- ఫిర్యాదుల స్వీకరణలో జాప్యం తప్పుడు సమాచారంతో తిరిగి పంపుతున్నారన్న విమర్శలు
- రిసెప్షన్ సిబ్బంది తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, సిద్దిపేట:**జిల్లా నలుమూలల నుంచి న్యాయం కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చే బాధితులు రిసెప్షన్ వద్దే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ సమస్యను నేరుగా పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలనే ఆశతో వచ్చిన ఫిర్యాదుదారులను లోపలికి పంపకుండా రిసెప్షన్ వద్దే నిలిపివేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలీస్ కమిషనరేట్ గడప వద్దే న్యాయానికి అడ్డుకట్ట పడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### గంటల తరబడి నిరీక్షణ... చివరకు నిరాశే

ఫిర్యాదు స్వీకరణలో జాప్యం, అధికారులు అందుబాటులో లేరంటూ గంటల తరబడి వేచి ఉంచడం, కొందరిని సరైన సమాచారం ఇవ్వకుండా వెనక్కి పంపించడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారు. న్యాయం కోసం వచ్చిన వారిని కనీసం వినకుండా తిరిగి పంపించడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని వారు వాపోతున్నారు.

### ప్రజాసేవకు అద్దం పట్టాల్సిన కార్యాలయంలో ఇదేనా తీరు.?

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన పోలీస్ కమిషనర్ కార్యాలయంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పోలీసులపై నమ్మకంతో వచ్చిన వారే అవమాన భావంతో వెనుదిరగాల్సి వస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రిసెప్షన్ సిబ్బంది వ్యవహార శైలిపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### సీపీ జోక్యం చేసుకోవాలంటున్న బాధితులు

రిసెప్షన్‌లో జరుగుతున్న వ్యవహారంపై పోలీస్ కమిషనర్ వెంటనే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, ఫిర్యాదుదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులను కలిసే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీఎంఆర్‌పై ఉత్తమ్ కీలక సమీక్ష

హైదరాబాద్, ప్రజా వాయిస్:తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు సాంకేతిక సంస్కరణల అమలుపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. గత 10 నుంచి 12 ఏళ్లుగా సీఎంఆర్ వ్యవస్థలో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలించారు.

### డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు

ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన నిధులను పూర్తిగా రాబట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

### విజిలెన్స్ కేసులపై సమీక్ష

ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలను అధికారులు మంత్రికి నివేదించారు.

### ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహం

ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు సీఎంఆర్ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త వ్యూహాలను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, న్యాయ విభాగాల ఉన్నతాధికారులతో సమన్వయం పెంచాలని సూచించారు.

### రైతుల ప్రయోజనాలే లక్ష్యం

రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధులను కాపాడడం, సీఎంఆర్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడమే ఈ సమీక్ష సమావేశం ప్రధాన ఉద్దేశమని అధికార వర్గాలు వెల్లడించాయి.

# త్రిష వ్యాఖ్యల కేసులో అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు ప్రశ్నించిన తర్వాత ఆయనను విడుదల చేశారు. ఈ పరిణామం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

### స్టాలిన్ ఘాటు హెచ్చరిక

ఈ వ్యవహారంపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కే. స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా "అహంకారం వినాశనానికి దారి తీస్తుంది.. హద్దులు దాటితే ఆ వినాశనం మరింత వేగవంతమవుతుంది" అంటూ టీవీకే ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### రాజకీయ కక్షతోనే అరెస్ట్?

తన కుమారుడు ఉదయనిధి ఎవరిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ అలా చేసినట్లు నిరూపితమైతే వెంటనే క్షమాపణలు చెబుతాడని స్టాలిన్ స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రతిపక్ష నేతను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడానికే ఈ అరెస్ట్ నాటకం ఆడారని ఆరోపించారు.

### టీవీకే ప్రభుత్వంపై డీఎంకే విమర్శలు

ఉదయనిధి అరెస్టుపై డీఎంకే నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కావేరీ జలాల సమస్య, మేకెదాతు డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో టీవీకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం విజయ్‌ను "డమ్మీ సీఎం"గా అభివర్ణిస్తూ, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.



# సుక్మా అడవుల్లో నక్సల్స్ డంప్ గుట్టు రట్టు..!

- సంయుక్త బలగాల కూంబింగ్‌లో ఆయుధాల భారీ స్వాధీనం
- 315 బోర్ రైఫిల్‌తో పాటు 49 లైవ్ కాట్రిడ్జ్‌లు, అల్యూమినియం కంటైనర్ పట్టివేత
- ఎస్పీ మయాంక్ గుర్జర్ ఆదేశాలతో ప్రత్యేక ఆపరేషన్ విజయవంతం
- నక్సల్ ఏరివేత మరింత ఉద్ధృతం.. కొనసాగనున్న కూంబింగ్ చర్యలు

ప్రజావాయిస్,చర్ల:ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా నక్సల్స్‌కు మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. బోద్రాజ్‌పదర్ అటవీ ప్రాంతంలో సంయుక్త భద్రతా బలగాలు నిర్వహించిన కూంబింగ్ ఆపరేషన్‌లో నక్సల్స్ దాచిపెట్టిన ఆయుధాల డంప్‌ను వెలికితీసి స్వాధీనం చేసుకున్నాయి. 315 బోర్ బోల్ట్-యాక్షన్ రైఫిల్‌తో పాటు 49 లైవ్ కాట్రిడ్జ్‌లు, అల్యూమినియం కంటైనర్ స్వాధీనం కావడం భద్రతా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

### నిఘా సమాచారంతో ప్రత్యేక ఆపరేషన్

విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ మయాంక్ గుర్జర్ ఆదేశాలు, ఏఎస్పీ (ఆప్స్) రోహిత్ షా పర్యవేక్షణలో ప్రత్యేక నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. బెజ్జి పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ 50వ బెటాలియన్ సంయుక్త బృందం బోద్రాజ్‌పదర్ అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు నిర్వహించింది.

### డంప్‌లో లభించినవి

గాలింపు సందర్భంగా నక్సల్స్ దాచిన డంప్‌ను గుర్తించిన బలగాలు .315 బోర్ బోల్ట్-యాక్షన్ రైఫిల్, 7.62×39 మి.మీ.కు చెందిన 47 లైవ్ కాట్రిడ్జ్‌లు, 7.62×51 మి.మీ.కు చెందిన రెండు లైవ్ కాట్రిడ్జ్‌లు, ఒక అల్యూమినియం కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం బలగాలు విజయవంతంగా ఆపరేషన్ ముగించి సురక్షితంగా శిబిరానికి చేరుకున్నాయి.

### కొనసాగనున్న నక్సల్ ఏరివేత

సుక్మా జిల్లాలో నక్సల్స్ కదలికలను పూర్తిగా అణిచివేసే వరకు కూంబింగ్, సెర్చ్ ఆపరేషన్లు మరింత ఉద్ధృతంగా కొనసాగుతాయని జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అడవుల్లో నక్సల్స్ దాచిపెట్టిన ఆయుధాల డంప్‌లను గుర్తించి నిర్వీర్యం చేసే చర్యలకు మరింత వేగం పెంచనున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ గుట్టపై క్వారీ పంజా..!







- రాత్రింబవళ్లు తవ్వకాల జోరు
- మైనింగ్, రెవెన్యూ అనుమతుల్లేకుండానే పేలుళ్లు..
- ట్రాక్టర్లు, లారీలతో రాళ్ల తరలింపు..లక్షల్లో దందా
- ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు
- పైరవీల నీడలో సాగుతున్న అక్రమ వ్యాపారంపై గ్రామస్తుల మండిపాటు
- పంటలకు నష్టం..రోడ్లు చిత్తు..దుమ్ము, శబ్ద కాలుష్యంతో ప్రజల విలవిల
- వెంటనే అడ్డుకట్ట వేయాలన్న డిమాండ్

**ప్రజా వాయిస్,అనంతగిరి:** ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన అధికారులు చూస్తుండగానే సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో ఓ ప్రభుత్వ గుట్ట రోజురోజుకూ కనుమరుగవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు ప్రభావశీలులు భారీ యంత్రాలతో గుట్టను యథేచ్ఛగా తవ్వేస్తూ అక్రమ క్వారీ దందాను సాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు పేలుళ్లు నిర్వహిస్తూ వెలికితీసిన రాళ్లను ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలించి లక్షల్లో అక్రమార్జన చేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం మౌనంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గుట్ట గల్లంతు.. ప్రభుత్వానికి కోట్ల నష్టం**

రోజురోజుకూ గుట్ట ఆకారం మారిపోతుండగా ప్రభుత్వ ఆస్తి కళ్లముందే కరిగిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండానే జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం కోల్పోతుండగా, అక్రమార్కులు మాత్రం కోట్ల రూపాయల విలువైన రాతిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**పేలుళ్లతో పంటలపై రాళ్లు..రైతుల ఆందోళన**

క్వారీలో నిర్వహిస్తున్న పేలుళ్ల ప్రభావంతో రాళ్లు, దుమ్ము సమీపంలోని వ్యవసాయ భూములపై పడుతూ పంటలకు నష్టం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. దుమ్ముతో పంటల దిగుబడి తగ్గుతుండగా, భయంతో పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

**రోడ్లు చిత్తు.. కాలుష్యంతో ప్రజల విలవిల**

భారీ వాహనాల రాకపోకలతో గ్రామ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామస్తులు అంటున్నారు. శబ్ద, వాయు కాలుష్యంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ పేలుళ్లతో గ్రామమంతా ఉలిక్కిపడుతోందని చెబుతున్నారు.

**విద్యుత్ నిబంధనలకూ తూట్లు.. అక్రమంగా మిషన్ల నిర్వహణ**

అక్రమ క్వారీలో వినియోగిస్తున్న భారీ రాతికోత యంత్రాలకు విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే విద్యుత్ వినియోగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ మీటర్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి, సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి నేరుగా వైర్లు లాగి భారీ యంత్రాలకు కనెక్షన్ ఇచ్చి రాళ్లను కోస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయ నష్టం వాటిల్లడమే కాకుండా, ఎప్పుడైనా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనం.. అనుమతులపై ఎంఆర్వో వివరణ**

మైనింగ్ ఏడి, విద్యుత్ శాఖ అధికారులను పలుమార్లు చరవాణి ద్వారా సంప్రదించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న అధికారులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది.అనంతగిరి ఎమ్మార్వో స్పందిస్తూ తాను మండలానికి వచ్చి రెండు నెలలు మాత్రమే అయ్యిందని, మైనింగ్ అనుమతులు మంజూరు చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేశారు. దరఖాస్తులను స్వీకరించి సంబంధిత మైనింగ్ శాఖకు పంపించడం మాత్రమే తమ విధి అని తెలిపారు. అనుమతుల జారీ, తదుపరి చర్యలన్నీ మైనింగ్ శాఖ పరిధిలోనే ఉంటాయని వెల్లడించారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహణకు సన్నాహాలు

**ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత**
**గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. జిల్లా పాలనా అధికారి కె. హరిత అధ్యక్షతన సమావేశం సాగింది.ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, జీవన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పే సందర్భంగా ఈ దినోత్సవాన్ని అన్ని శాఖల సమన్వయంతో సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆదివాసీ సమాజ ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచనలు అందాయి.గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ దినోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ ప్రదర్శనలు, యువజన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.సమావేశంలో స్థానిక శాసన సభ్యురాలు కోవా లక్ష్మి , ఆదివాసీ తొమ్మిది తెగల పెద్దలు, రాజ్ గోండ్ సేవా సమితి జాతీయ అధ్యక్షులు సిడాం అర్జు మాస్టర్, ఆసిఫాబాద్ మండల సార్ మేడి జ్ఞానేశ్వర్, ప్రధాన్ పురోహిత్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు పెందూర్ సుధాకర్, వెంకటేష్, పీఎంఆర్సీ ఏసీఏ ఎంఓ పూర్కా ఉద్ధవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

- మంత్రి సీతక్క చేతుల మీదుగా సదరం శిబిరం, యూడీఐడీ భవనం ప్రారంభం
- అర్థో, గైనిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీలకు నాలుగు నూతన ఆపరేషన్ థియేటర్లు ప్రారంభం

**.ములుగు, ఆగస్టు 4 (ప్రజా వాయిస్):**ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా కీలక అడుగు పడింది. నూతన సదరం శిబిరం, యూడీఐడీ (UDID) భవనం, అర్థో, గైనిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించిన నాలుగు ఆధునిక ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు'తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మంత్రి సీతక్క పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీసి, నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య బృందం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ స్థానికంగా లేకుంటే ప్రజల సమస్యలు తెలిసేదెలా





- రాయపర్తి మండలంలోని శివరామపురం గ్రామంలో పత్తలేనీ పాలకులు
- గ్రామస్థితిగతులపై సర్పంచికి వివరించడానికి ఫోన్ చేస్తే భర్త సమాధానం చెప్తూ దాటవేస్తున్నారంటూ ఆరోపణలు
- గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ నిర్లక్ష్యం వహిస్తున్న తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

**ప్రజా వాయిస్ వరంగల్** (రాయపర్తి):వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పరిధిలోని శివరామపురం గ్రామపంచాయతీలో సర్పంచ్ వ్యవహార శైలి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఆ గ్రామ ప్రజలు. శివరామపురం గ్రామ సర్పంచ్ గా గెలిచిన నుండి నేటి వరకు గ్రామ అభివృద్ధిని మరిచారని ఆరోపిస్తున్నారు.గత కొన్ని నెలలుగా గ్రామంలోని రోడ్డు బాటలను శుభ్రపరచాలని ఎన్నిసార్లు గ్రామ ప్రజలు కోరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ సర్పంచ్ తీరిపై మండి పడుతున్నారు.గత ఎండాకాలం నుంచే సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లిన, ప్రస్తుతం వర్షాకాలం వచ్చిన తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీలో ప్రజల సమస్యలు వినేందుకు గ్రామ సర్పంచ్ అందుబాటులో లేకపోవడం కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. గ్రామ సమస్యలపై మాట్లాడేందుకు ఫోన్ చేసినప్పుడు కూడా సర్పంచ్ భర్త సమాధానం ఇవ్వడం వల్ల గ్రామ ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారనీ,ఇప్పటికైనా సర్పంచ్ స్థానికులకు అందుబాటులో ఉంటూ గ్రామంలో కనీస సౌకర్యాలు, పరిశుభ్రత, రోడ్ల నిర్వహణ వంటి అంశాలపై వెంటనే దృష్టి సారించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## చెరువులను తలపిస్తున్న దమ్మపేట ప్రధాన రహదారి

- తీవ్ర ఇబ్బందుల పడిన వాహనదారులు
- గుంటలు పడడంతో చెరువుల మారని వైనం
- తక్షణమే రోడ్డు సమస్యలు పరిష్కరించాలంటూ ప్రయాణికుల ఆవేదన


**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నుండి దమ్మపేట వెళ్ళు రోడ్డు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని శ్రీనివాస కాలనీ రోడ్డు చెరువులను తలపిస్తోంది. పాల్వంచ నుంచి దమ్మపేట వైపు వెళ్లే మార్గంలో వరద నీరు చేరి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను కలగజేస్తుందంటూ ఏ ప్రదేశంలో ఏ గుంట ఉన్నదో కూడా తెలియకుండా ఉందంటూ ప్రయాణికులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో శ్రీనివాస్ కాలనీ రోడ్డు తీవ్ర ఆటంకంగా మారుతుంది. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం, కాలువలను ఆక్రమించి భవనాలు నిర్మించటమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారాన్ని చేపట్టాలని రోడ్డు ప్రయాణికులు స్థానికులు తెలియజేస్తున్నారు. కావున ఇకనైనా భద్రాద్రి జిల్లా కలెక్టర్ మరియు మున్సిపాలిటీ మేయర్, మరియు మున్సిపాలిటీ కమిషనర్ తక్షణమే స్పందించి పాల్వంచ మున్సిపల్ వ్యాప్తంగా రోడ్లపై కాల్వలలో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండనివ్వకుండా తక్షణమే చర్యలు చేపట్టాలంటే స్థానికులు కోరుకుంటున్నారు.



## గోదావరిఖని వన్ టౌన్ సీఐపై 'మహిళా కమిషన్' సీరియస్!

- ఖాకీ అధికారం దుర్వినియోగం.. అక్రమ గృహ ప్రవేశంపై నోటీసులు!
- సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రామగుండం కమిషనర్ కి రాష్ట్ర మహిళా మండలి సంచలన ఆదేశాలు




TELANGANA STATE COMMISSION FOR WOMEN
HYDERABAD
TGSCW

To
The Commissioner of Police
Ramagundam
Peddapally District – 505 460.

Petition No.723/POPL/TGSCW/2026, Dt.23.07.2026

Sub: TGSCW – Sri. Boddu Ravinder, Peddapally District – Against Mr. Indrasena Reddy for misuse of powers and illegal house trespass – Necessary action – Report called for – Reg.

Ref: National Commission for Backward Classes, New Delhi forwarded to Telangana State Commission for Women, Hyderabad petition of Sri. Boddu Ravinder, dt.10.07.2026 at TGSCW, Hyderabad.

******

It is to inform that, Sri. Boddu Ravinder, S/o. Rajaiah, Peddapally District has filed a petition before National Commission for Backward Classes, New Delhi forwarded to Telangana State Commission for Women, Hyderabad against Mr. Indrasena Reddy for misuse of powers and illegal house trespass.

In this regard, it is requested to conduct enquiry, take necessary action and send compliance report to this office.

Encl: Copy of petition

SECRETARY

Copy to:
Sri. Boddu Ravinder, S/o. Rajaiah, H.No.9-3-554, Vithal Nagar, Godavarikhani, Peddapally District – 505209 for information.

**ప్రజా వాయిస్ గోదావరిఖని** అధికార దుర్వినియోగం, అక్రమ గృహ ప్రవేశం ఆరోపణలకు సంబంధించి రామగుండం ప్రాంతానికి చెందిన బొడ్డు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర మహిళా మండలి (కమిషన్) తీవ్రంగా స్పందించింది. గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ కు మహిళా మండలి ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే... పెద్దపల్లి జిల్లా గోదావరిఖని (విఠల్ నగర్) నివాసి అయిన బొడ్డు రవీందర్, గోదావరిఖని వన్ టౌన్ సీఐ సీఐ ఇంద్రసేన రెడ్డి తనపై అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అక్రమంగా గృహ ప్రవేశం చేశారని ఆరోపిస్తూ జాతీయ వెనుకబడిన తరగతుల మండలికి ఫిర్యాదు చేశారు. సదరు జాతీయ మండలి ఈ ఫిర్యాదును తెలంగాణ రాష్ట్ర మహిళా మండలికి పంపించింది.వచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించిన రాష్ట్ర మహిళా మండలి, గత నెల 23-07-2026న రామగుండం కమిషనర్ కి అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటూ పూర్తి నివేదికను తమ కార్యాలయానికి పంపాలని మహిళా మండలి కార్యదర్శి సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నిష్పాక్షిక విచారణ జరపాలి:**

ఈ సందర్భంగా బాధితుడు బొడ్డు రవీందర్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమే. ఏ రకమైన రాజకీయ లేదా ఇతర ప్రభావాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పాక్షికంగా విచారణ జరపాలి. బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలి అని విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదాలకు నిలయం.. ప్రధాన రహదారి

- గాయాల పాలవుతున్న వాహనదారులు
- నల్లాల పైపులు పగిలి మురికి నీరు
- రోగాల బారిన పడుతున్నా మంటున్నా ప్రజలు
- రహదారి జలమయం.. శాశ్వత పరిష్కారం ఎప్పుడు?
- ప్రజలను పట్టించుకోని నాయకులు.. అధికారులు

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన రహదారి అనునిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈ దారి గుండా వెళ్ళుతుంటాయి . పెద్ద పెద్ద గుంతలు. ప్రజలకు మంచినీటిని అందించే పైపులైను రహదారిపై కొన్నిచోట్ల పగిలిపోవడంతో గుంతల్లో నీరు చేరడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రతిరోజు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వివరాల్లోకి వెళితే హనుమకొండ పట్టణంలోని ములుగు రోడ్డు నుండి కాకతీయ యూనివర్సిటీ కాజీపేట హసన్పర్తి కరీంనగర్ కు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో రెడ్డి కాలనీ యాదవ నగర్ వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రతిరోజు ప్రమాదాలకు గురవుతున్నామని.. దీంతోపాటుగా మంచినీటిని ప్రజలకు అందించే నల్లాలు కొన్ని చోట్ల పగిలిపోవడంతో మురికి నీరు వస్తుందని అట్టి నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని రోడ్డంతా జలమయం ప్రభుత్వాలు మారిన ప్రజలకు సౌకర్యం అందించడంలో నాయకులు సంబంధిత అధికారులు విఫలమయ్యారని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి. మంచినీటి పైపులైనుకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్న ప్రజలు.





## సరూర్‌నగర్ స్టేడియంలో టిఆర్ఎస్ సంకల్ప సభ

- సామాజిక న్యాయం, బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యం
- గజ్వేల్ నుండి 1000 మంది ప్రతినిధుల తరలింపు
- ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కవిత ఆధ్వర్యంలో సభ
- టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ ఇంచార్జి కొట్టాల యాదగిరి

**ప్రజా వాయిస్, గజ్వేల్ :** రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం ఆశించిన సామాజిక న్యాయం జరగలేదు, ప్రతి వర్గానికి, వెనుకబడిన వారికి రాజకీయ అవకాశాలు కల్పించడమే ఈ సభ లక్ష్యం, బీసీలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించే దిశగా ఈ సభా వేదిక కీలకంగా ఉంటుంది అని టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఈ నెల 6న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు గజ్వేల్ నుండి 1000 మంది ముఖ్య ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షించిన సామాజిక తెలంగాణ నిర్మాణమే సభ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రతినిధులు హాజరయ్యే ఈ సభ ద్వారా పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తూ, సామాజిక న్యాయం అమలు, ప్రజల అభిప్రాయాన్ని పాలకుల దృష్టికి బలంగా తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎడ్ల నర్సింలు, శ్రీకాంత్, స్వామి, అమర్ సింగ్, చందు, ప్రసాద్, కుమార్, వెంకటేష్, అశోక్, రాజేష్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో.. 'ఎవరికి వారే.. యమునా తీరే..!

- గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం!
- రోగులకు శాపంగా మారిన ప్రసూతి ఏరియా తీరు
- అపరిశుభ్రత మురికి నీటి నిలయాలుగా దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని హాస్పిటల్ యాజమాన్యం, మున్సిపల్ అధికారులు





**ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట):** వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి తలమానికంగా ఉండాల్సిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. నిత్యం వందలాది మంది రోగులతో కిటకిటలాడే ఈ ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఏరియా ఆసుపత్రిలో ఎవరికి వారే.. ఏమైనా తీరే అన్నట్లుగా యాజమాన్యం, మున్సిపాలిటీ వ్యవస్థల తీరు తయారైందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి పరిసరాల్లో ఎటు చూసినా నిలిచిపోయిన మురికి నీటి గుంటలే దర్శనమిస్తున్నాయి. ఆసుపత్రికి నిత్యం తనిఖీలు, వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు, వృద్ధులు ఈ దుర్గంధం నడుమ, వ్యాధులు ప్రబలే ప్రమాదకర వాతావరణంలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దోమలు విపరీతంగా పెరిగిపోయి ఆసుపత్రికి వచ్చిన రోగులకు కొత్త రోగాలను తెచ్చిపెట్టేలా పరిస్థితి తయారైంది.రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం అందించాల్సిన హాస్పిటల్ యాజమాన్యం కనీస పారిశుధ్య చర్యలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ యంత్రాంగం కూడా ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తను తొలగించడం, నిల్వ ఉన్న నీటిని తోడేయడం, బ్లీచింగ్ చల్లడం వంటి ప్రాథమిక పనులను కూడా విస్మరించడం శోచనీయంగా మారింది.అంతే కాకుండ పట్టణానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈగ దామోదర్ హస్పెటల్లో కలియతిరిగుతూ ఫోటోకు ఫోజులు ఇస్తున్నారు తప్ప..కళ్ళ ముందే మురికి నీటి నిలువలు ,ప్రక్కనే చిన్నపిల్లలతో కూర్చొని ఆహారాన్ని సేవిస్తున్న దృశ్యాలు కనపడుతున్న పరిసరాలను శుభ్రపరిచే విధంగా పట్టణ అధ్యక్షుడు అభివృద్ధి పై మొఖం చాటేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

**కొండ నాలుకకి మందేస్తే..ఉన్న నాలుక ఊడిన చందంగా దవాఖాన పని తీరు..**

ఆరోగ్యం బాగుపడటానికి ఆసుపత్రికి వస్తే, ఇక్కడి అపరిశుభ్ర వాతావరణం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే పరిస్థితి దాపురించిందని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కోట్లు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై వర్ధన్నపేట ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి పరిసరాల్లో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి, మురికి నీటిని తొలగించి, ఫాగింగ్ చేయించాలని స్థానికులు మరియు బాధితులు డిమాండ్ చేస్తున్నా రు.

## జిల్లా అభివృద్ధే లక్ష్యం

- పార్టీలకు అతీతంగా సహకారం అందిస్తా
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజా వాయిస్ / మోమిన్‌పేట్:** వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట్ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు.మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలని, ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేలా పనిచేయాలని స్పీకర్ సూచించారు. ప్రజలు ఫోన్ చేసినప్పుడు అధికారులు తప్పనిసరిగా స్పందించి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రతి మండలంలో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, గ్రామాల నుంచి రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని, నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపాధి హామీ పథకం గ్రామీణాభివృద్ధికి ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు.వికారాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాకు నీరు అందించే బాధ్యత తనదేనని స్పీకర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సర్పంచులు, వార్డు సభ్యులకు పూర్తి అవగాహన ఉండాలని, అధికారులు గ్రామస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులు వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన పెంచాలని అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, తహసీల్దార్ మునీరుద్దీన్, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# ప్రజారోగ్యమా... ఆదాయమా?

- బెల్టు షాపులను అరికట్టని ప్రభుత్వాలెందుకు?
- ఆర్థికంగా కుంగిపోతున్న కుటుంబాలు
- ఓవైపు మద్యానికి బానిసలవుతున్న యువత
- బెల్టు షాపులపై రాజీలేని ప్రభుత్వాన్ని ఈ జన్మలో అసలు చూస్తామా?
- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 24/7 బెల్టు దందా

**ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** బెల్టు షాపులను అరికట్టలేని ప్రభుత్వాలు ఏం లాభం?ఎవరికి ఉపయోగం.ప్రజారోగ్యమా... ఆదాయమా? ఇదే ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. బెల్టు షాపులను నిర్మూలిస్తామని ప్రతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు హామీలు ఇస్తుంది. కానీ ఆ హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు రోజురోజుకూ బలపడుతున్నాయి.మద్యం విక్రయాలకు ప్రభుత్వ అనుమతి ఉన్నా, అనధికారికంగా నడుస్తున్న బెల్టు షాపులు చట్టాన్ని బహిరంగంగా ధిక్కరిస్తున్నాయి. అయినప్పటికీ అవి నిరాటంకంగా కొనసాగడం వెనుక అధికార యంత్రాంగం వైఫల్యమా? లేక రాజకీయ నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు.ఒకవైపు యువత మద్యానికి బానిసలవుతోంది. మరోవైపు కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. మహిళలు గృహహింసకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతింటోంది. ఇన్ని దుష్పరిణామాలు కనిపిస్తున్నప్పటికీ బెల్టు షాపులపై కఠిన చర్యలు మాత్రం అరుదుగా కనిపిస్తున్నాయి.వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పట్టణాల నుండి మొదలు కొని పల్లెల దాకా గల్లీకో బెల్టు షాపు దర్శనమిస్తుందంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవ్వాలి. పలు గ్రామంలో మధ్యపాన నిషేధం విధిస్తూ తీర్మానాలు చేసుకోవడం విశేషం కాగా ఆ గ్రామాలను ఇతర గ్రామాలు ఎందుకు ఆదర్శంగా తీసుకోకూడదు? ఒకసారి ఆలోచించండి.ప్రభుత్వం దాడులు నిర్వహించడం మానేసి ప్రోత్సహించడం దురదృష్టకరం.చట్టం అందరికీ సమానమైతే, అక్రమంగా మద్యం విక్రయించే వారిపై ఎందుకు నిరంతర చర్యలు ఉండడం లేదు?బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలంటే కేవలం ప్రకటనలు సరిపోవు. నిరంతర నిఘా, బాధ్యులపై కఠిన చర్యలు, అధికారుల జవాబుదారీతనం, ప్రజల సహకారం....ఈ నాలుగు కలిసి పనిచేసినప్పుడే ఫలితం కనిపిస్తుంది.మద్యం వల్ల నాశనమవుతున్న కుటుంబాల కన్నీళ్లను తుడవడం ప్రభుత్వాల బాధ్యత. బెల్టు షాపులపై రాజీలేని పోరాటం ఎప్పుడు ప్రారంభమవుతుంది? ఇదే ప్రజల ప్రశ్న... ప్రభుత్వాల సమాధానం కోసం సమాజం ఎదురుచూస్తోంది


TELANGANA HUMAN RIGHTS COMMISSION
Gruhakalpa Complex, MJ Road, Nampally, Hyderabad-500 001.
Ph. No. 040-24601572 Fax: 040-24601573
Present: Dr. Justice Shameem Akther, Hon'ble Chairperson,

SR No. 3144 of 2026 HRC No.3185 of 2026 Dt.04.08.2026

The Commission has gone through the news item published in **Andhra Jyothi** Telugu Daily Newspaper dated 04.08.2026, at page-9, under the caption "27 మంది విద్యార్థినులకు అస్వస్థత – వర్ధన్నపేట ఎస్టీ బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్", reporting that 27 girl students residing in the ST Girls Hostel, Wardhannapet, Warangal District, allegedly fell ill after consuming contaminated food served in the hostel.

The news report alleges that the students developed severe stomach pain, vomiting and diarrhoea soon after consuming the food provided in the hostel. It is further alleged that despite the students exhibiting symptoms, timely medical attention was not provided and only tablets were administered initially. The affected students were reportedly shifted to the Area Hospital only on the following morning. The report further states that an inspection conducted by the authorities revealed poor sanitation, inadequate drainage facilities and deficiencies in food quality, which were prima facie found to have contributed to the incident.

The allegations, if true, disclose serious concerns relating to the health, safety, nutrition and welfare of girl students residing in a Government-run welfare hostel and prima facie involve issues affecting their human rights.

Accordingly, the Commission hereby takes suo-motu cognizance of the matter and calls for a detailed report, by next date, from **the District Collector, Warangal District**, on

## వర్ధన్నపేట లో ఫుడ్ పాయిజన్ పై మానవహక్కుల కమిషన్ ఆగ్రహం

- కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ఆదేశాల మేరకు సుమోటోగా కేసు నమోదు
- సమగ్ర నివేదికను సెప్టెంబర్ 7న సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన కమిషన్

**ప్రజా వాయిస్ వరంగల్:** వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కారణంగా 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు విచారణకు ఆదేశించింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశాల మేరకు సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి వివిధ దినపత్రికలో ప్రచురితమైన వార్తను పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, అస్వస్థతకు గురైన విద్యార్థినుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన వైద్య చికిత్స, వసతి గృహంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై నిర్వహించిన విచారణ, బాధ్యులపై తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన నివారణ చర్యలపై సమగ్ర నివేదికను సెప్టెంబర్ 7న సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

## బురదలోనే అమీనాబాద్ బాట

- వర్షాలకు ప్రధాన రహదారి దయనీయ స్థితి
- గుంతల్లో నిలిచిన నీటితో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

**ప్రజా వాయిస్,అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని అమీనాబాద్ గ్రామ ప్రధాన రహదారి వర్షాలతో పూర్తిగా బురదమయంగా మారి ప్రజలకు నిత్య నరకంగా మారింది. రోడ్డంతా గుంతలు, నిల్వ నీటితో నిండిపోవడంతో చిన్న వాహనాలు సైతం గ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షం పడిన ప్రతిసారీ ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపడి గాయపడుతుండగా, పాదచారులు, వృద్ధులు రోడ్డు దాటేందుకు సైతం భయపడుతున్నారు. బడికి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు కూడా గ్రామంలోకి చేరలేకపోతున్నాయని తెలిపారు.రోడ్డు మరమ్మతుల కోసం పలుమార్లు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రతి ఏడాది తాత్కాలిక మరమ్మతుల పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే అధికారుల కార్యాలయాల ముందు పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.







# పేదవాడి బతుకుపై బుల్డోజర్

- దామరచర్లలో కుమ్మరి కుటుంబానికి షాక్
- ప్రభుత్వ భూముల్లో భారీ నిర్మాణాలపై ప్రశ్నలు
- చిన్న షెడ్డు మాత్రమే అధికారులకు కనిపించిందా
- రాజకీయ కక్షా.. లేక అధికార దర్పమా..
- కబ్జాలపై సమగ్ర సర్వే చేయాలంటున్న స్థానికులు
- అధికారుల తీరుపై విమర్శలు వెల్లువ

**ప్రజా వాయిస్,దామరచర్ల.** నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండల కేంద్రంలోని బొడ్రాయి బజారులో జీవనోపాధి కోసం చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని కుండలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కుమ్మరి కులానికి చెందిన నాగయ్య అనే నిరుపేద వ్యక్తి షెడ్డును మంగళవారం మండల అధికార,గ్రామ పంచాయతీ యంత్రాంగం పోలీసుల బందోబస్త్ తో తొలగించింది. ఈ చర్యపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో ప్రభుత్వ భూముల్లో భారీ భవనాలు నిర్మించి, షట్టర్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, పేద కుటుంబం ఏర్పాటు చేసుకున్న చిన్న షెడ్డు మాత్రమే కూల్చివేయడం వివక్షకు నిదర్శనమని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువు శిఖం భూములు, గ్రామకంఠం భూముల్లో జరిగిన ఆక్రమణలు అధికారులకు కనిపించవా అని ప్రశ్నిస్తున్నారు. పెద్దల ఆక్రమణలపై మౌనం పాటిస్తూ, బతుకుదెరువు కోసం కష్టపడుతున్న పేదవారిపై మాత్రమే చర్యలు తీసుకోవడం రాజకీయ కక్ష సాధింపా, అధికార దర్పమా, లేక బలహీన వర్గాలపై చిన్నచూపా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో దామరచర్లలో కూడా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడితే అన్ని అక్రమ నిర్మాణాలపైనా సమానంగా చర్యలు తీసుకోవాలని, పేదలపై మాత్రమే చట్టం అమలు చేయడం సరికాదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందన..**

ఇదే విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి పున్నయ్య ను ప్రజా వాయిస్ ప్రతినిధి వివరణ కోరగా.. నాగయ్య అనే వ్యక్తి గ్రామ కంఠం భూమిలో అక్రమంగా నిర్మాణం చేపట్టడం జరిగింది..అదే భూమిలో మార్కెట్ ఏర్పాటు చేయాలనీ గతంలోనే గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది.అతనికి 2023 నుంచి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు కూల్చివేత చేపట్టటం జరిగిందన్నారు.

## ఖేడ్ : ఇరాక్‌పల్లి లో దారుణ హత్య

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్** నాగల్‌గిద్ద మండలం ఇరాక్‌పల్లి గ్రామంలో కుటుంబ కలహాలు విషాదాంతానికి దారితీశాయి. భార్యాభర్తల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఎర్ఫన్న గత ఆరు నెలలుగా తన తల్లిగారింట్లో నివసిస్తోంది. ఇటీవల కుటుంబ పెద్దల సమక్షంలో రాజీ కుదరడంతో వారం రోజుల క్రితం ఆమె భర్త సయ్యద్ సుల్తాన్ (35) వద్దకు తిరిగి వచ్చింది.అయితే సోమవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని దర్గా వద్ద సయ్యద్ సుల్తాన్ తన భార్య ఎర్ఫన్నను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున సుమారు 1 గంట సమయంలో నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిందితుడు స్వయంగా లొంగిపోయాడు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సింది



# వర్ధన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో మళ్ళీ కుళ్ళిన ఆహారపదార్థాలు

- ఫుడ్ పాయిజన్ అయి 24 గంటలు గడవక ముందుకే అదే పాఠశాలలో మరో ఘటన
- కుళ్ళిన కూరగాయలతో విద్యార్థినీల తల్లి దండ్రులు ఆందోళన
- విద్యార్థినిలతో వెట్టి చాకిరి చేపిస్తున్న ప్రధానోపాధ్యాయుడు
- ప్రజా వాయిస్ తో ఉపాధ్యాయుడి అరాచ కాలను వెల్లడిస్తూ విద్యార్థుల ఆవేదన
- బాలికల ముందే చొక్కా విప్పి క్లాస్ రూమ్ లోనే ఉమ్మి వేస్తూ ప్రధానోపా ధ్యాయుడి అరాచకాలు
- మున్సిపల్ చైర్మన్ తో ఏడుస్తూ తమ గోడును వివరించిన వైనం
- కలెక్టర్ స్పందించి ప్రధాన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు మరియు తల్లిదండ్రుల డిమాండ్








**ప్రజా వాయిస్ వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీలోని గిరిజ ఆశ్రమ పాఠశాలఆదివారం సాయంత్రం 27మందివిద్యార్థులకు ఫుడ్పాయిజన్ కావడంతో వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖాన లో చేరి చికిత్స పొందుతున్న తరుణంలో అదే పాఠశాలలో నేడు మళ్ళీ సీన్ రిపీట్ అయింది..వివరాలోకి వెళ్లితే ఆదివారం ఉదయం చపాతి తోపాటు మధ్యాహ్నం చికెన్ బాగర రైస్ తోపాటు రాత్రి బెండాకాయ టమాట సాంబన్ తినడం జరిగిందని విద్యార్థులు తెలిపారు. నిన్న ఉదయం పూరి కూర్మ తిన్నమని దీంతో రాత్రి నుంచి విద్యార్థులకు కడుపు నోప్పితో పాటు వాంతులు విరేచనాలో కావడంతో వారికి మందులు ఇచ్చారు. సోమవారం విద్యార్థులకు ఎక్కువ కావడంతో ఉదయం వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో చేరి చిక్సత పోందుతున్నారు. ఇదిలా ఉండగా అదే తంతుగా విద్యార్థినిలకు ఫుడ్ పాయిజన్ అయి 24 గంటలు కాక ముందే ఈ పాఠశాలలో కుళ్ళిన కూరగాయలతో విద్యార్థినులకు వండి పెడుతున్న సంఘటన వెలుగులోకి రావడంతో పాఠశాల వద్దకు విద్యార్థినిల తల్లిదండ్రులు చేరుకుని కూలిన కూరగాయలను చూపెడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ చైర్మెన్ పాలకుర్తి సారంగపాణి జరిగిన సంఘటనలపై ఆరా తీస్తూ ఉండగా విద్యార్థినిలు ఒక్కసారిగా బోరున వెయిట్ చేశారు తమ ప్రధానోపాధ్యాయుడు తరచూ మద్యం సేవించి పాఠశాలకు రావడం విద్యార్థినిలతోటే తాను తిన్న ప్లేట్లను సైతం కడిగించడం అదేవిధంగా.. విద్యార్థినిల ముందే చొక్కా విప్పేసి అసభ్యకరంగా ఉమ్మివేస్తూ నాన్న ఇబ్బందులకు గురి చేస్తున్నారు అంటూ విలపించారు..

### మద్యం సేవించే ప్రధానోపాధ్యాయుడు ..విద్యార్థుల తో వెట్టి చాకిరి..

అక్షరాలు దిద్దించి, అజ్ఞానాన్ని పారద్రోలాల్సిన ఉపాధ్యాయుడే అజ్ఞానంలో కూరుకుపోయాడు. విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (HM) మృగంలో మారాడు. మద్యం మత్తులో పాఠశాలకు రావడమే కాకుండా, విద్యార్థులతో వెట్టి చాకిరి చేయిస్తూ వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్న దిగ్భ్రాంతికర ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది... చదువురా ప్రాంతాలలో ఉన్న పేద మధ్య తరగతి కుటుంబాల పిల్లలను ఆశ్రమ పాఠశాలకు పాఠాలు నేర్చుకోవడానికి వచ్చే పసిపిల్లలకు ఆ హెచ్.ఎం చుక్కలు చూపిస్తున్నాడు. రోజూ మద్యం సేవించి బడికి రావడం ఆయనకు అలవాటుగా మారింది. అంతటితో ఆగక, విద్యార్థుల ముందే చొక్కా విప్పేసి వింత చేష్టలు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాడనీ విద్యార్థినిలు ఆరోపిస్తున్నారు. తను తిన్న తిండి పళ్ళెం కడగడం దగ్గర్నుంచి, పాఠశాలలో తన సొంత పనులన్నీ విద్యార్థులతోనే చేయించుకుంటూ వారిని బానిసల్లా వాడుకుంటున్నాడని విద్యార్థులు బోరున విలపిస్తున్నారు. అంతేకాకుండా ఆ ఉపాధ్యాయుడి రాక్షసత్వానికి హద్దు లేకుండా పోతుందని తరగతి గదుల్లోనే ఇష్టారాజ్యంగా ఉమ్మేస్తూ విద్యార్థినులతో అత్యంత అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "సార్.. ఇదేంటి?" అని ధైర్యం చేసి అడిగిన విద్యార్థులను తీవ్రంగా బెదిరిస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు... దీంతో నీచమైన చర్యలకు పాల్పడుతున్న ఆ ప్రధానోపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని విద్యార్థులు, ఏడుస్తూ వివరిస్తున్న తీరు అక్కడికి వచ్చిన అధికారులను సైతం కంటతడి పెట్టేలా ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులను ఆవేదనతో వేడుకుంటున్నారు. ఇటువంటి ఉపాధ్యాయుడి వల్ల పాఠశాలకు పంపడానికే భయమేస్తోందని, తక్షణమే న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని వివిధ విద్య సంఘాలు సైతం హెచ్చరిస్తున్నారు.

### విద్యార్థులకు మనోధైర్యాన్ని నింపిన మున్సిపల్ చైర్మన్..

విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మద్యం మత్తులో పాఠశాలలో అరాచకాలకు పాల్పడుతున్న ఆ ప్రధాన ఉపాధ్యాయుడు పై కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి తగిన చర్యలు చేపడతామని విద్యార్థినిలకు భరోసా కల్పించారు. అంతేకాకుండా పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరిగిన తమ దృష్టికి తీసుకురావాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతిరోజు పాఠశాలను సందర్శించి తమ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.. అనంతరం విద్యార్థినులకు నచ్చచెప్పి విషయాన్ని ఓ కొలిక్కి తీసుకురావడంతో విద్యార్థులలో మనోధైర్యాన్ని నింపారు.



## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

- ఐనవోలులోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసి జిల్లా ఇన్చార్జి కలెక్టర్

**జా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఏపి, ఇతర ఎరువుల నిల్వలను షాపు యజమాని తిరుపతిని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ షాప్ కు ఎక్కడి నుండి ఎరువులు విత్తనాలు వస్తుంటాయనే సమాచారాన్ని ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని యూరియా బస్తాలు విక్రయించారని, వాటికి సంబంధించిన రికార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని అన్నారు. యూరియా, ఇతర ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ తనిఖీ లో తహసిల్దార్ విక్రమ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## రైతును కష్టాల్లోకి నెట్టిన కాంగ్రెస్ పాలన

- క్రాప్ లోన్ల రెన్యూవల్ లో బ్యాంకుల ఆంక్షలపై మండిపాటు
- 24 గంటల ఉచిత విద్యుత్ హామీ అమలు కాలేదని విమర్శ
- ఎరువుల రవాణా రాయితీ రద్దుతో రైతుపై అదనపు భారం
- రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్డీవోకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వినతిపత్రం అందజేత



**ప్రజా వాయిస్,కోదాడ:** కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో తెలంగాణ రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి మంగళవారం కోదాడ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రాప్ లోన్ల రెన్యూవల్ విషయంలో బ్యాంకులు అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని షరతులు విధించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం బ్యాంకులపై నియంత్రణ సాధించడంలో విఫలమవడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామన్న హామీ అమలు కాలేదని, విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ కారణంగా మోటార్లు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. సాగునీరు సకాలంలో అందక పంటలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకు ఇచ్చే FOL రాయితీని రద్దు చేయడం వల్ల రవాణా ఖర్చు పెరిగి చివరకు రైతులపైనే భారం పడుతుందని తెలిపారు. రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు.




## కుళ్లిపోయినజంతు కళేబరా వాసనతో ప్రజలకు రోగాలను అంటిస్తున్న పరకాల మునిసిపాలిటీ?

**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల పరకాల పట్టణం లో కుళ్లిపోయిన జంతు కళేబర వాసనతో వివిధ పనుల నిమిత్తం ఆర్డిఓ కార్యాలయం. తాసిల్ కార్యాలయాంలో వచ్చిన ప్రజలు దుర్వాసనతో నానా ఇబ్బందులకు గురయ్యామని వాపోయారు. ఆర్డిఓ ఆఫీస్ ఎమ్మార్వో ఆఫీస్ దీని పక్కనే ఆనుకొని ఉన్న ప్రధాన పోలీస్ స్టేషన్ ఇన్ని ఆఫీసులకు మునిసిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాల మండలాల నుండి నిత్యం వందలాది ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ అధికారులకు విన్నపాలు విన్నవించుకోవడానికి రాకపోకలు సాగించే కార్యాలయాల్లో పంది చనిపోయి కుక్కలు పీక్కుతిని దుర్వాసన పెద్దజల్లుతున్నా , పరకాల మున్సిపాలిటీ కమిషనర్ మరియు అధికారులు నిద్రపోతున్నారా నిద్ర నటిస్తున్నారా కళ్ళున్నా చూడటం లేదా ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రజలకు రోగాలను అంటిస్తున్న పరకాల మునిసిపాలిటీ అని ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు అసలు మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోరా రోగాల పాడిన పడాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు ఇకనైనా నిద్రపోతున్న అధికారులు కన్ను తెరిచి అసలే వర్షాకాలం అంటువ్యాధుల సీజను మలేరియా డెంగ్యూ కలరా వంటి వ్యాధులు వ్యాపించక ముందే జాగ్రత్తలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్న ప్రజానీకం.

## ఖాకీ దర్పాన్ని కూల్చేసిన గిరిజన గర్జన!

- యువకులపై దాడి చేస్తే ఇదే గతి
- ఎఫ్ ఆర్ వో లక్ష్మీనారాయణ సస్పెన్షన్!
- వైరల్ వీడియో తెచ్చిన తంటా
- అటవీ అధికారికా ఇష్యూలో బిగ్ యాక్షన్!



**ప్రజా వాయిస్ /మంచిర్యాల క్రైమ్** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఇందన్పల్లి అటవీ రేంజ్ అధికారి (FRO) లక్ష్మీనారాయణను ఉన్నత అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవల ఇందన్పల్లి అటవీ రేంజ్ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి చెందిన కొంతమంది యువకులను అటవీ సిబ్బంది విచక్షణారహితంగా కొట్టిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై స్థానిక ఆదివాసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. యువకులపై దాడి ఉదంతంపై అటు స్థానిక ఎమ్మెల్యే కూడా తీవ్రంగా స్పందించి, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ జరిపిన ఉన్నత అధికారులు.. బాధ్యుడైన ఎఫ్ఆర్వో లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అటవీశాఖలో ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

## ప్రేమ పేరుతో పక్కా ప్లాన్...

- దివ్యాంగ అడ్వకేట్ ను నమ్మించి రూ.7.50 లక్షల టోకరా
- ఫేస్ బుక్ పరిచయాన్ని ప్రేమగా మార్చి పెళ్లి హామీ
- ఆరు నెలలుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్న బాధితురాలు
- నిందితుడిని పట్టి పోలీసులకు అప్పగించినా..చర్యలేమీ లేవన్న విమర్శలు
- పోలీసుల నిర్లక్ష్యంపై బార్ అసోసియేషన్ ఆగ్రహం
- ఉన్నతాధికారుల జోక్యం కోరిన బాధితురాలు



**ప్రజా వాయిస్,హుజూర్ నగర్:** సోషల్ మీడియా పరిచయాలతో అమాయకులను వలలో వేసుకుని పెళ్లి పేరుతో మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్ల బాగోతం మరోసారి బయటపడింది. తల్లిదండ్రులు లేని, అంగవైకల్యంతో పోరాడుతూ న్యాయవాదిగా నిలదొక్కుకున్న ఓ మహిళనే లక్ష్యంగా చేసుకుని ఓ కిరాతకుడు నమ్మించి గొంతు కోశాడు.

### అసలేం జరిగింది?

బాధితురాలి కథనం ప్రకారం.. హుజూర్ నగర్ పట్టణానికి చెందిన దివ్యాంగ న్యాయవాది షేక్ మౌలాబీకి ఫేస్ బుక్ ద్వారా గుంటూరుకు చెందిన షేక్ కరీముల్లాతో పరిచయం ఏర్పడింది. పరిచయాన్ని ప్రేమగా మార్చి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమె అమాయకత్వాన్ని ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకున్నాడు. పెళ్లి తర్వాత నమ్మకంగా ఉంటూ ఆమె నుండి సుమారు రూ. 7.50 లక్షలు కాజేసి ఉడాయించాడని బాధితురాలు ఆరోపిస్తోంది.ఇది కేవలం డబ్బు మోసం కాదు.. ఒక అనాథ, దివ్యాంగ మహిళ జీవితంతో ఆడుకున్న దారుణమైన నేరం.

### 6 నెలలుగా పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు

ఈ ఘటనపై బాధితురాలు 6 నెలల క్రితమే పోలీసులకు మిస్సింగ్ కేసుతో పాటు మోసం ఫిర్యాదు ఇచ్చింది. కానీ ఖాకీలకు చీమ కుట్టినట్లు కూడా లేదు. బాధితురాలు దివ్యాంగురాలు, అనాథ అనే కనీస కనికరం కూడా చూపకుండా కేసును తొక్కిపెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయం కోసం న్యాయవాదే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి.

### నిందితుడిని పట్టి ఇస్తే... ప్రైవేట్ జామానత్ పై విడుదల

పోలీసుల నిర్లక్ష్యంతో విసిగిపోయిన బాధితురాలు తన సొంత నెట్వర్క్ ద్వారా నిందితుడైన కరీముల్లాను వెతికి పట్టుకుని పోలీసులకు అప్పగించింది. బాధితురాలే పోలీసు పని చేసి దోషిని తీసుకొస్తే, పోలీసులు ఏ విచారణ లేకుండా, ఏ కేసు నమోదు చేయకుండా ఒక ప్రైవేట్ వ్యక్తి పూచీకత్తుపై నిందితుడిని వదిలేయడం! ఇది పోలీసు వ్యవస్థ తీరునా బాధితురాలికి న్యాయం చేయాల్సిన పోలీసులే నిందితుడ్ని నిర్లక్ష్యంగా వదిలివేశారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయండని ఆ దివ్యాంగ అడ్వకేట్ కన్నీళ్లతో అర్థిస్తోంది.

### మౌలాబీ డిమాండ్స్

1.తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గుంటూరుకు చెందిన షేక్ కరీముల్లాపై చీటింగ్, మోసం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.2. బాధితురాలి 7.50 లక్షల డబ్బును ఇప్పించాలి.3. నిర్లక్ష్యంగా వ్యవహరించి, నిందితుడిని ప్రైవేట్ జామానత్ పై వదిలేసిన పోలీస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఆడబిడ్డకు అండగా ఉండాల్సిన వ్యవస్థే ఇలా మొద్దు నిద్రపోతే ఎలా? ఈ దివ్యాంగ అడ్వకేట్ కు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జక్కుల వీరయ్య తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

## అభివృద్ధి పేరుతో కోట్లు స్వాహా

- ఎమ్మెల్యే పీఎస్ ఆర్ పై రఘునాథ్ రావు సంచలన ఆరోపణలు



**ప్రజా వాయిస్/ మంచిర్యాల్** అభివృద్ధి ముసుగులో మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ భారీ అవినీతికి పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులను కొల్లగొడుతూ అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఇండస్ట్రియల్ పార్క్, మహాప్రస్థానం, రామగుండం వంతెన నిర్మాణాల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించి మింగేస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ అవినీతికి డిప్యూటీ సీఎం, మంత్రి శ్రీధర్ బాబు కూడా పూర్తి అండగా నిలుస్తున్నారని, వారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని విమర్శించారు.సింగరేణి కాంట్రాక్టర్ల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతూ విపరీతమైన దోపిడీకి తెరలేపారని రఘునాథ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాధనాన్ని దోచుకుంటున్న తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

# వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతి పై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్‌కు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా? ఉంటే ఏయే ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటి ద్వారా జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. వరంగల్ జిల్లాలో కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు సుమారు ₹7,843 కోట్ల వ్యయంతో 447 కిలో మీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులు, ₹6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అలాగే పీఎం మిత్ర పథకం కింద 1,327 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న బ్రౌన్‌ఫీల్డ్ టెక్స్‌టైల్ పార్క్‌కు సుమారు ₹1,696 కోట్ల వ్యయం కేటాయించినట్లు పేర్కొంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ అభివృద్ధికి సంబంధించి కేంద్రం వద్ద ఉన్న ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, అమలులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత కోరినట్లు వెల్లడించారు. రైల్వే, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి" అని ఎంపీ తెలిపారు. అలాగే, వరంగల్‌కు మంజూరైన ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉంది అని పేర్కొన్నారు.

# మునుగోడు వైద్యరంగానికి మంత్రి గ్రీన్ సిగ్నల్

- మంత్రి దామోదరతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక భేటీ
- వారం రోజుల్లో అభివృద్ధి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- చౌటుప్పల్ ట్రామా కేర్, మదర్ అండ్ చైల్డ్ సెంటర్ కు గ్రీన్ సిగ్నల్





**ప్రజా వాయిస్, నల్గొండ.** మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మంగళవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలు, నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే సమగ్ర ప్రతిపాదనలు సమర్పించారు.సమావేశంలో మునుగోడు, నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించి 30 పడకల ఆసుపత్రులుగా అభివృద్ధి చేయాలని, మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 30 పడకల నుంచి 50 పడకలకు విస్తరించాలని, అవసరమైన వైద్య సిబ్బంది, సాంకేతిక పరికరాలు, పోస్టుమార్టం పరీక్ష గది ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.చండూరు రెవెన్యూ కేంద్రంలో 100 పడకల ఏరియా ఆసుపత్రి మంజూరు చేసి నిర్మించాలని, గట్టుప్పల్ పీహెచ్‌సీకి సిబ్బంది, వైద్య పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి-65పై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడేందుకు చౌటుప్పల్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అక్కడి 100 పడకల ఏరియా ఆసుపత్రిని ఆధునీకరించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులకు ప్రస్తుతం ఉన్న బడ్జెట్ పెరుగుతున్న నిర్మాణ వ్యయాలకు, ఆధునిక అవసరాలకు సరిపోవడం లేదని, వాటి బడ్జెట్ పెంపుపై కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలు, అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.అలాగే చౌటుప్పల్ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. చౌటుప్పల్‌లో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, మునుగోడు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, నల్గొండ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్, డీసీహెచ్ మాతృనాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్‌వో మనోహర్, డీసీహెచ్ సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# మేళ్లచెరువు రైస్‌మిల్లులో రూ.53.66 కోట్ల ధాన్యం గోల్‌మాల్

- ఆకస్మిక తనిఖీల్లో 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం వ్యత్యాసం
- రికార్డులు,భౌతిక నిల్వల్లో భారీ తేడా బకాయిలు కలిపి కోట్లలో నష్టం
- పూర్తి విచారణ తర్వాత కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

**ప్రజా వాయిస్,మేళ్లచెరువు**/హుజూర్ నగర్: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని శ్రీ శ్రీనివాస సాయి శివాయ రైస్ ఇండస్ట్రీలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ అవకతవకలు వెలుగుచూశాయి. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, నల్గొండ అధికారులు, జిల్లా పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో సుమారు 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అందుబాటులో లేకపోవడం గుర్తించారు.రబీ 2022-23, రబీ 2023-24, ఖరీఫ్ 2024-25, రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, స్టాక్ వివరాలు, మిల్లులోని భౌతిక నిల్వలను సరిపోల్చగా గణనీయమైన వ్యత్యాసాలు బయటపడ్డాయి. ప్రాథమిక లెక్కల ప్రకారం మాయమైన ధాన్యం విలువ సుమారు రూ.48 కోట్లు కాగా, రబీ 2022-23 సీజన్‌కు సంబంధించిన రూ.5.66 కోట్ల బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ధాన్యం విలువ, బకాయిలు కలిపి ప్రభుత్వానికి సుమారు రూ.53.66 కోట్ల మేర ఆర్థిక నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.తనిఖీల్లో రీజినల్ విజిలెన్స్ అధికారి ప్రతాప్, సీఐ గౌస్, జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మాయం చేయడం లేదా దుర్వినియోగం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని జిల్లా పౌర సరఫరాల అధికారి స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కనుచూపు మేర కనిపించని కాంగ్రెస్ పార్టీ

- తాండూర్ లో సర్ ప్రక్రియలో ఇప్పటికే 71 శాతం డిజిటలైజేషన్ పూర్తి.
- బీఆర్ఎస్ తాండూర్ నియోజకవర్గ ఇన్ చార్జ్ పంజుగుల శ్రీశైల్ రెడ్డి

**ప్రజా వాయిస్/తాండూర్:** దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నప్పటికీ, తాండూర్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడా కనిపించడం లేదని బీఆర్ఎస్ తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంజుగుల శ్రీశైల్ రెడ్డి విమర్శించారు.మంగళవారం తాండూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నరుకుల నరేందర్ గౌడ్ అధ్యక్షతన సర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ...తాండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు, నాయకులు, కార్యకర్తలు సర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు.ఆర్డీవో కార్యాలయం గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 71 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని చెప్పారు.తాండూర్ పట్టణంలో బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు, మృతుల పేర్లపై ఉన్న ఓట్లు, ఇతర ప్రాంతాలకు మారిన వారి ఓట్ల పరిశీలన ఎక్కువగా ఉండటంతో ప్రక్రియ కొంత ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.సీఎం స్వయంగా తాండూర్ ఎమ్మెల్యేకు భూముల వ్యవహారాల కంటే సర్ ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ పార్టీ పనితీరుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రజలు దీనిని గమనించాలని కోరారు.మిగిలిన ఆరు రోజుల గడువును సద్వినియోగం చేసుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వని వారు వెంటనే అందజేయాలని ప్రజలను కోరారు. ఇతర ప్రాంతాల్లో ఓటు ఉన్న వారు అక్కడి ఓటును తొలగించుకుని తాండూర్‌లోనే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# చెరువు కబ్జాపై మత్స్యకారుల ఆందోళన

## మల్లయ్య కుంట వద్ద అందోళన చేస్తున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు

**ప్రజా వాయిస్ హన్మకొండ** / హసన్పర్తి ప్రభుత్వ చెరువులను,.కుంటలను కాపాడాల్సిన ఇరిగేషన్ , రెవెన్యూ శాఖల అధికారులు వాటిపై నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించడంతో కబ్జాకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామ శివారులో ఉన్న మల్లయ్య కుంట చెరువు ఆక్రమణకు గురవుతోందంటూ మంగళవారం చెరువు వద్ద మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా ముచ్చర్ల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు రవి మాట్లాడుతూ... గ్రామ శివారులోని సర్వే నెంబర్ 815 లో మల్లయ్య కుంట దాదాపు మూడు ఎకరాల చెరువు భూమిని చుట్టుపక్కల వారు ఆక్రమించి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించినట్లు ఆరోపించారు. కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులతో చెరువు ఎండిపోతుండటంతో ఇదే అదనుగా భావించిన చుట్టుపక్కల రైతులు చెరువును ఆక్రమిస్తూ ఆనవాలు పోయేలా చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు అంటి ముట్టనట్లుగా వ్యవహరించడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లే కుండా పోతుందని అన్నారు. ఇప్పటికే ముచ్చర్ల గ్రామంలోని 13 కుంట లు కబ్జా చేసి అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు, చెరువును నమ్ముకొన్ని జీవిస్తున్న 300 మంది మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడే ప్ర మాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు . రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మత్స్యకారులు హెచ్చరించారు.





# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించండి
- ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగ్యస్వామ్యం మరింత పెరగాలి
- బాల వికాస ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం
- అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

**జిన్నారం ప్రజావాయిస్** ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని.. వాటి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి బాల వికాస ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారికి సూచించారు. గడ్డపోతారా మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..ఇష్టపడి చదివి, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యను కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఒక సాధనంగా భావించాలని ఆయన సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన, ప్రతిభకు కృషి తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు విద్యారంగం అభివృద్ధికి మరిన్ని సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు.పాఠశాల నుండి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు లేకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యక్షంగా చూస్తున్నానని.. వెంటనే సిసి రోడ్డు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. వావిలాల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, కో ఆప్షన్ సభ్యులు రవీందర్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, మోల్డ్ టెక్ పరిశ్రమ ప్రతినిధి ఉగేష్, గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఇర్షాద్, నవీన్
- మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత.

**ప్రజా వాయిస్/ తాండూర్:** తాండూర్ పట్టణం సర్వేనం 135లోని ప్రభుత్వ భుమిలో జరవుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవలని బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఇర్షాద్ ,నవీన్ మున్సిపల్ కమిషనర్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాండూర్ పట్టణం సర్వేనం 135 అనేది ప్రభుత్వ భుమిలో ఉన్న విషయం విదితమె. అ సర్వేనం నంబర్లో చట్ట బద్ధమైన లీజు దారులు,ఇతర హక్కుదారులు కూడా ఉన్నారు. అయితే అ సర్వేనం నంబర్ లో ప్రభుత్వ భుమిలో కొంత భాగంలో ఎలాంటి చట్ట బద్ధమైన అను మతులు లేకుండ అక్రమ నిర్మాణలు కొనసాగుతున్నమునే అరోపణలు.. ప్రజల నుండి వస్తున్నయి.ఫలితంగా గతంలో సర్వే నెం, 111 వివదాస్పద నిర్మాణలు అక్రమణ లతో, సంబందం ఉన్న వ్యక్తులే ఇప్పుడు సర్వే నెంబర్ 135లోని ప్రభుత్వ భుమిలో కూడ నిర్మానాలు చేపడుతున్నారు అనే అరోహలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఈ విషయం పై సమగ్రంగా విచరణ జరిపి వాస్తవాలు నిర్ధారించి ప్రభుత్వ భుమిలో ఏక్కడైన అక్రమ నిర్మాణలు జరుగుతునట్లు తెలితె వాటినీ వెంటనే నిలిపివేసి బాధ్యులపై పరమైన చర్యలు తీసుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.



## కేజీబీవీలో వసతులు మెరుగ్గా ఉండాలి

- ఐనవోలులోని కేజీబీవీని సందర్శించిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి



**ప్రజా వాయిస్ హన్మకొండ / అయినవోలు :**
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం( కేజీబీవీ )లో వసతులు మెరుగ్గా ఉండాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.
మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సందర్శించారు.
ఈ సందర్భంగా వంట గదిలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తుండగా ఇన్చార్జ్ కలెక్టర్ పరిశీలించారు. భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. విద్యార్థినులతో చదువుల గురించి మాట్లాడి తెలుసుకున్నారు. అధికారులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్, కూరగాయలను పరిశీలించారు. విద్యాలయానికి సంబంధించిన విషయాలను ప్రత్యేక అధికారి సునీతను ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఈ తనిఖీలో తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, మండల వ్యవసాయ అధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లిలో వన మహోత్సవం

- ప్రతి ఇంటికి ఆరు మొక్కల పంపిణీ



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో సర్పంచ్ మోర్లె పార్వతి ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.
గ్రామంలోని ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేసి, వాటిని నాటి సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడబడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా మొక్కలను స్వీకరించి, వాటిని పెంచేందుకు ముందుకు వచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోర్లె సమత రాజు, వార్డు సభ్యులు చెన్నూరి తిరుమలేష్, పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగు పరచాలి

- 16 రకాల నిత్యవసర సరుకులు తెల్ల రేషన్ కార్డు ద్వారా అందించాలి.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జైల్ బరో జయప్రదం చేయండి.
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం.



**ప్రజా వాయిస్/పాలకుర్తి :**
తెల్ల రేషన్ కార్డుదారుల అందరికీ 16 రకాల నిత్యవసర సరుకులు రేషన్ దుకాణాల ద్వారా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుక్య చందునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో వ్యాకాసా, సిఐటియు, రైతు సంఘం సంయుక్త సమావేశం శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో బచ్చు శ్రీలత కాకర్ల బాబు, పెండ్లి భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ, దేశంలో సుమారుగా 24 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని అంత్యోదయ కార్డులు రెండు కోట్ల 25 లక్షలు, మొత్తం లబ్ధిదారులు 80 కోట్ల మంది ఉన్నారని, తెలంగాణలో సుమారుగా కోటి కార్డులు. మూడు కోట్ల 25 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, అయితే తెలంగాణ ప్రభుత్వం బియ్యం తప్ప ఏ నిత్యవసర వస్తువులు అందించడం లేదన్నారు, ప్రధాన రకాల వస్తువులు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద శక్తులకు లొంగిపోయి అమెరికా నుండి మక్కజొన్న . పత్తి. చేపలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను జీరో టార్క్ తో దిగుమతి చేసుకోవడానికి అంగీకరించడం దేశ రైతాంగ కార్మిక వర్గం వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని విమర్శించారు, కార్మికులు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ తీసుకురావడం కార్మికుల హక్కులపై దాడి అని అన్నారు.
గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ వి బి జి రాంజీ పేరుతో కేంద్రం కొత్త పథకాన్ని తీసుకురావడం గ్రామీణ పేదల జీవనోపాధి పై దెబ్బ అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తూ విద్యుత్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తుందని, రైతు డిస్కౌంట్ బిల్లును అమలు చేయడానికి మూడవ డిస్కౌంట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు ఉపాధి హామీ చట్టాన్ని నీరుగా అర్చడం, లేబర్ కోడ్స్ ను రద్దు చేయడం కోరుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాలకు కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల సోమన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోమసత్యం, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్, మాసంపల్లి నాగయ్య, బెల్లి సంపత్, మూస్కు ఇంద్రారెడ్డి, ఏనుగ తల వెంకన్న, చిట్యాల సంధ్యారాణి, అంబటి సోమయ్య, కుమార్, తోటరాజు, గడ్డి సమ్మయ్య, మల్పరాజు నరేష్, చెరుపెల్లికొంరయ్య, వేల్పుల కొమురయ్య, నక్క రమేష్, కాకర్ల చిన్న సోమయ్య, ఎల్లయ్య, ఒగ్గుల సోమయ్య, ఒగ్గుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

- జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలకు నాయకుల పిలుపు




**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా :**
వనపర్తి జిల్లాపానగల్ మండల కేంద్రంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ఆధ్వర్యంలో మండల సదస్సు సిఐటియు మండల కన్వీనర్ సూర్యవంశం రాము అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు R N రమేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్ల బాల్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రేగి చెట్టు నిరంజన్ సర్పంచ్ మాట్లాడుతూ★. ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. 29 లేబర్ చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నారు , 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలకు పని దినాన్ని తీసుకురావడం, కార్మికులకు తీరని నష్టం చేసే విధంగా ఉన్నాయని వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి 29 కార్మిక చట్టాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుపేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసి వీబీ రాంజీ పేరుతో ఉపాధి హామీని నీరుగార్చే విధంగా రాష్ట్రం వాటా 40% ఇస్తే కేంద్రం వాట 60% జమ చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని గత ప్రభుత్వాలు 90% కేంద్రం నుంచి నిధులు ఇచ్చే వాళ్ళని వెంటనే విబి రాంజీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఎంఎస్పి చట్టాన్ని అమలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. భారతదేశానికి స్వతంత్రం రాకముందు ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమని రగిలించి భారత దేశ ప్రజలను ఐక్యం చేసి బ్రిటిష్ వాళ్ళని ఈ దేశం నుంచి తరిమేసినరు, కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకి కారు చౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను భారతదేశం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ధ్వంసం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు ఇతర దేశాలకు చౌకగా అమ్మేయడం జరుగుతుందని అందులో భాగంగానే భారతదేశ కార్మిక వర్గాన్ని వ్యవసాయ కూలీలను రైతాంగాని పరోక్షంగా బడా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం విధానాలు తీసుకురావడం సరి అయినది కాదని ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో భారతదేశ ప్రజల యొక్క మౌలిక హక్కులని కాపాడడం కోసం కార్మిక వర్గాన్ని నిలబెట్టడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మిక వర్గం ముందుండి పోరాడుతుందని ఇలాంటి మోడీలను ఎంతోమందిని ఇంటికి పంపిందని అలాంటి నరేంద్ర మోడీ కార్మికులతో చెలగాటమాడుతున్నాడని రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు కర్షకులు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, జిల్లా నాయకులు జంబులయ్య సర్పంచ్, భాస్కర్, సిఐటియు నాయకులు, శ్యామల, మహేశ్వరి, రేణుక ,సుజాత, లక్ష్మి , సుగ్రీవుడు, చందు, రంగస్వామి, బాలస్వామి, తిరుపతయ్య, డివైఎఫ్ఐ మండల కన్వీనర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్‌దిన్నే గ్రామంలో ఎన్‌టీఈపీ ఆధ్వర్యంలో టీబీ ఆరోగ్య శిబిరం

- టీబీ వ్యాధిగ్రాస్తులు వైద్యుల సూచనలు పాటించాలి : గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా:**
వనపర్తి జిల్లావీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్‌దిన్నే గ్రామంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ ) ఆధ్వర్యంలో టీబీ నిర్ధారణ అవగాహన ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. వీపనగండ్ల మండల పల్లె దవాఖాన ఆధ్వర్యంలో,జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ సూచనల మేరకు గోపాల్‌దిన్నే గ్రామ గ్రంథాలయం సమీపంలో ఈ శిబిరం నిర్వహించారు.డాక్టర్ శ్వేతతో పాటు ఎన్‌టీఈపీ బృంద సభ్యులు వినోద్, మధు,బాలకృష్ణ పర్యవేక్షణలో గ్రామ ప్రజలకు టీబీ పరీక్షలు,ఛాతీ ఎక్స్‌రేలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత,డాక్టర్ శ్వేత మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛమైన తాగునీరు వినియోగించాలని,ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాలని సూచించారు.మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.
టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పోషకాహారం తీసుకోవాలని కోరారు.వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టీఈ నిపుణుడు,చిన్నపిల్లల వైద్యుడు సహా ఇతర వైద్యులు అందుబాటులో ఉన్నారని,ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌టీఈపీ బృంద సభ్యులు వినోద్,మధు,బాలకృష్ణ, ఏఎన్ఎం సునంద,ఆశా కార్యకర్తలు పార్వతమ్మ,జయమ్మ,అంకిత,గ్రామ ప్రజలు,రైతులు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వల్లభాపురం గ్రామసభ లో గ్రామ అభివృద్ధి పనులపై తీర్మానం

- గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- గ్రామపంచాయతీ కార్యదర్శి, దర్గా



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా:**
వనపర్తి జిల్లావీపనగండ్ల మండలంలోని వల్లభాపురం తాండలో గ్రామ సర్పంచ్ సభావత్ శివమ్మ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్య, తాగునీటి సమస్య, మంచినీటి కోసం కొత్త పైప్‌లైన్ ఏర్పాటు, డ్రైనేజీ కాలువల నిర్మాణం తదితర అంశాలను గ్రామస్థులు సభ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ సభావత్ శివమ్మ మాట్లాడుతూ,,, తాండలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు.అలాగే ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని, నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, వార్డు సభ్యులు చావులి, మన్నేమ్మ, దేవులి, ఫ్యామిలీ రెడ్యా నాయక్, అంగన్‌వాడీ టీచర్ చిట్టెమ్మ, ఆశా కార్యకర్తలు లత, గోబ్రి, మహిళా సంఘం సభ్యురాలు బోజ్జమ్మ, ఎంపీడబ్ల్యూ సిబ్బంది రామదాసు, రూప్లి, తాండ ప్రజలు పాల్గొన్నారు.

## యాప్ ల ద్వారా ఎరువుల బుకింగ్ విధానం సరైనది కాదు

- రైతులు చేసేది సాఫ్ట్వేర్ ఉద్యోగం కాదు
- జనసేన అధ్యక్షుడు ఉసికల రమేష్



**ప్రజా వాయిస్,జూలూరుపాడు :**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆన్లైన్ ఎరువుల బుకింగ్ విధానం సరైంది కాదని, రైతులు చేసేది సాఫ్ట్వేర్ ఉద్యోగం కాదని, భద్రాద్రి జిల్లా, జూలూరుపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎరువుల బుకింగ్ ప్రక్రియలో రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది రైతులకు స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఉన్నవారికి యాప్‌ల వినియోగంపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులు చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాదని, చదువు లేక, వ్యవసాయంపై ఆధారపడి తాము తింటూ ఇతరులకు తిండి పెడుతున్నారని అన్నారు. ఎరువులు కొనుగోలు చేయడానికి యాప్‌లు, ఆన్‌లైన్ బుకింగ్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైనది కాదని, దీనివలన సరైన సమయంలో పంటలకు కావలసిన ఎరువులు అందక తీవ్రంగా పంట నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం యూరియా బుకింగ్ జరుగుతున్నట్లు, ఆగస్టు ఆరో తారీకు నుండి మిగతా కాంప్లెక్స్ ఎరువులు కూడా అలానే బుక్ చేసుకోవాలని వస్తున్న కథనాలను అదునుగా చేసుకొని ఎరువుల డీలర్లు రైతులను మరింతగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇదే అదునుగా రైతులకు ఎరువులను అంటగట్టి వారి గోడౌన్లు ఖాళీ చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా మండలంలో సుమారుగా 20 మందికి పైగా ఎరువుల డీలర్లు ఉన్న, యూరియా నిలువలు రైతులకు అందుబాటులో ఉంచకపోవడం విడ్డూరమని, డీలర్లు కాంప్లెక్స్ ఎరువులు ఏవిధంగా అమ్ముతున్నారో యూరియని కూడా అదేవిదంగా అమ్మాలని, లేని పక్షంలో ప్రభుత్వం డీలర్ల లైసెన్స్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

## ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ ప్రజలకు అవగాహన

- సంగీనేనిపల్లి రచకట్ట దగ్గర నిర్వహించిన అవగాహన కార్యక్రమం.





**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా :**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, యూనియన్ బ్యాంక్ సహకారంతో, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో సాయంత్రం 6:00 గంటలకు సంగీనేనిపల్లి రచకట్ట వద్ద "ఆర్థిక అక్షరాస్యత" కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం, సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇన్సూరెన్స్ పథకాలు, బ్యాంకింగ్ సేవలు తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత బృందం ద్వారా ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు, అదేవిధంగా సైబర్ మోసాల నివారణ, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు, కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎస్ఐ నరేష్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకోవాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ లేదా సందేశాల ద్వారా బ్యాంకు వివరాలు, ఓటిపిలు అడిగితే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. ప్రజలకు ఆర్థిక విషయాలపై అవగాహన పెంపొందించడం, డిజిటల్ బ్యాంకింగ్‌ను సురక్షితంగా వినియోగించేలా చేయడం, సైబర్ మోసాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, వనపర్తి జిల్లా కార్యాలయం వారు నిర్వహించినట్లు తెలిపారు.



## పుస్కూరి ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి

**ప్రజా వాయిస్/పాలకుర్తి :**
పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యులు పుస్కూరి శ్రీనివాసరావు మాతృమూర్తి ప్రమీలమ్మ సోమవారం రోజున స్వర్గస్తులు కాగా (మంగళవారం) వారి సగృహానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి,వారి వెంట పాలకుర్తి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, పాలకుర్తి వార్డు సభ్యులు కామారపు సునీల్,తొర్రూరు మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్, మెరుగు మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు హనుమాన్ల నరేందర్ రెడ్డి ఉన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్

- మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా బాధ్యత వహించాలి॰
- జిల్లాలో ఇప్పటికే 97 కేసులు నమోదు - కలెక్టర్ బడుగు చంద్రశేఖర్॰॰

**ప్రజా వాయిస్,నల్గొండ :**
మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు, యువత, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్, మద్యం, సిగరెట్లు, డిజిటల్ వ్యసనాలకు దూరంగా ఉంటేనే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని అన్నారు.నల్గొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మంగళవారం నషా ముక్త్ భారత్, మిషన్ స్పందన్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ తరాలు మారుతున్న కొద్దీ పిల్లల ఆటపాటలతో పాటు వ్యసనాల స్వరూపం కూడా మారిపోయిందని కలెక్టర్ అన్నారు. ఒకప్పుడు మద్యం, సిగరెట్లకే పరిమితమైన వ్యసనాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, డిజిటల్ పరికరాలు, మాదక ద్రవ్యాల వరకు విస్తరించాయని చెప్పారు. గతంలో ఆర్థికంగా ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉన్న డ్రగ్స్ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకోవడం ఆందోళనకర పరిణామమన్నారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు ప్రభుత్వంతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యత వహించాలని సూచించారు.గత మే నెలలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత జెన్-జీ తరం డ్రగ్స్ రహిత తరంగా ఎదగాలని ఆకాంక్షించారు.వివిధ కారణాలతో యువత మాదక ద్రవ్యాల బారిన పడి తమ విద్య, ఉపాధి, భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి వ్యసనానికి అలవాటు పడితే వ్యక్తిగత జీవితం, కుటుంబ బంధాలు, సామాజిక జీవనం తీవ్రంగా దెబ్బతింటాయని, చివరకు ఏకాకితనానికి దారితీస్తుందని హెచ్చరించారు.మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా లేదా బలవంతంగా వినియోగించమని ప్రోత్సహిస్తున్నా వెంటనే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 97 డ్రగ్స్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు.2047 స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలంటే యువత మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సేవలను అభినందించిన కలెక్టర్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ చేపట్టిన మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని ప్రశంసించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదనపు ఎస్పీ రమేష్ విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ నల్లగొండ ఇన్‌చార్జి రాజయోగి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా దేశవ్యాప్తంగా పది కోట్ల మంది యువతతో మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించడం లక్ష్యమని తెలిపారు.

# వరంగల్ కమిషనరేట్ పరిధిలో "సురక్ష కా తిరంగా" సైబర్ క్రైమ్ అవగాహనా కార్యక్రమాలు

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి :**

తెలంగాణ డీజీపీ, సూచనల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TSCSB) డైరెక్టర్ ఆదేశానుసారం, వరంగల్ పోలీస్ కమిషనర్ మరియు డీఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ ఆధ్వర్యంలో, 05-08-2026 నుండి నాలుగు వారాల పాటు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో "సురక్ష కా తిరంగా" సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి.




ఈ కార్యక్రమాలలో భాగంగా క్రింది అంశాలపై విస్తృత అవగాహన కల్పించబడుతుంది:

సైబర్ ప్రతిజ్ఞ (సైబర్ ప్లేడ్జి ) ప్రజా అవగాహన సమావేశాలు (పబ్లిక్ అవేర్నెస్ మీటింగ్స్ ) పోస్టర్ల విడుదల మరియు డిజిటల్ క్రియేటివిటీ కార్యక్రమాలు అవగాహన ర్యాలీలు మీడియా బ్రీఫింగ్సో షల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కార్యక్రమాల వారాల వారీ ప్రణాళిక:

మొదటి వారం: పాఠశాలలు, కళాశాలలు మరియు యువతకు.

**రెండవ వారం:** ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు, వైద్యులు మరియు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు.

**మూడవ వారం:** పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు (అంగోస్ ), మహిళా సంఘాలు మరియు వయోవృద్ధులకు.

**నాల్గవ వారం:** భారీ ప్రజా సమూహాలు (బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు మరియు మాల్స్) లక్ష్యంగా ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఫ్లాష్ మాబ్స్ మరియు షార్ట్ ఫిల్మ్స్ ప్రదర్శనలు నిర్వహించబడతాయి.

**మొదటి రోజు నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు:**

**సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి:** కాళోజీ కళాక్షేత్రం మరియు హనుమకొండ కలెక్టర్ కార్యాలయం.

**హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధి:** ప్రభుత్వ జూనియర్ కళాశాల.

**మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధి:** కాకతీయ మెడికల్ కళాశాల.

**కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి:** కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల.

**మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి:** శంభునిపేట చౌరస్తా.

ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధి: సీకేఎం కళాశాల.

ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధి: మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే స్కూల్ & కళాశాల.


**జనగాం పోలీస్ స్టేషన్ పరిధి:** జనగాం కలెక్టర్ కార్యాలయం.

**దేవరుప్పుల పోలీస్ స్టేషన్ పరిధి:** దేవరుప్పుల చౌరస్తా.

తరిగొప్పుల పోలీస్ స్టేషన్ పరిధి: జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, తరిగొప్పుల.

**జఫర్గఢ్ పోలీస్ స్టేషన్ పరిధి:** సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ స్కూల్. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికీ దశలవారీగా నాలుగు వారాలపాటు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడనున్నాయి. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేశారు..

## 6న మెదక్ గవర్నర్ రాక...



**ప్రజా వాయిస్, పాపన్నపేట :** రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల ఈనెల ఆరవ తేదీన మెదక్ జిల్లా పర్యటనకు రానున్నారు. ఆరోజు పది గంటల నుంచి 5 గంటల వరకు ఉండనున్నారు. ముందుగా పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మను దర్శనం చేసుకోనున్నారు. అనంతరం మెదక్ చారిత్రాత్మక ఖిల్లా, ప్రసిద్ధ చర్చి సందర్శించనున్నారు. రాందాస్ చౌరస్తాలో విద్యార్థులతో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. కలెక్టర్ నటిమాసింగ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నారు

## విధి దీపాలకు అలుముకున్న చెట్లు

### విష సర్పాల భయంతో ప్రజలు



**ప్రజా వాయిస్, చేగుంట :** చేగుంట మండల్ పొలంపల్లి గ్రామంలో విచ్చల విడిగా కరెంటు వీధి దీపాల స్తంభాల కింద చెట్లు ఉండడంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు, కరెంట్ తీగల మధ్యలో చెట్లు ఉండడంతో వర్షకాలం కారణంగా ఈదురు గాలులు వచ్చినప్పుడు వీధి దీపాల కింద చెట్లు ఉండడంతో కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు, కరెంటు స్తంభాల వద్ద చెట్లు గుంపుగా ఉన్నచోట కూడా విష సర్పాలు ఉండొచ్చని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు, ఇప్పటికైనా దయ తలచి గ్రామంలో ఎక్కడైనా వీధి దీపాల కింద చెట్లు ఉంటే కరెంటు తీగలకు అల్లుకొని ఉన్న చోట్ల త్వరగా వాటిని నిర్మూలం చేసే చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని కోరడం జరిగింది.

## మద్యం మత్తులో భార్యతో గొడవపడి

- ఉరి వేసుకోని వ్యక్తి హత్మహత్య
- మృతునికి ఇద్దరు కూతుర్లు



**ప్రజా వాయిస్, చేగుంట :** చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము మోహన్,వ (37), తండ్రి రామయ్య, వృత్తి వ్యవసాయం మద్యం మత్తులో తన భార్యతో గొడవ పడి మనస్థాపనతో, వారి ఇంట్లో ఉన్న చీరతో ఉరి వేసుకుని మరణించారు, మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు, ఇట్టి విషయములో మృతుని భార్య కొమ్ము వసంత ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించనున్నారు,

## అనంతగిరిలో నిలిచిపోయిన భూభారతి సేవలు

- 15 నెలలుగా వేతనాలు లేక ఆపరేటర్ల ఆందోళన
- ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- అనంతగిరి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభింపు
- రైతులు, ప్రజలు గంటల తరబడి నిరీక్షించి వెనుదిరుగు

**ప్రజా వాయిస్,అనంతగిరి:** భూభారతి ఒప్పంద ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త నిరసనల ప్రభావం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల తహసీల్దార్ కార్యాలయంపై పడింది. ఆపరేటర్లు విధులకు దూరంగా ఉండటంతో భూముల రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిగా స్తంభించాయి. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, బ్యాంకు రుణాల ప్రక్రియల కోసం వచ్చిన పలువురు గంటల తరబడి వేచి చూసి నిరాశతో వెనుదిరిగారు.

ఈ సందర్భంగా భూభారతి ఆపరేటర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 636 మంది భూభారతి ఉద్యోగులు ఉండగా, వారిలో 290 మందిని తగ్గించే ఉత్తర్వులు జారీ కావడంతో ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఏప్రిల్ 2025 నుంచి జులై 2026 వరకు 15 నెలలుగా వేతనాలు అందక ఇంటి అద్దెలు, బ్యాంకు ఈఎంఐలు, వైద్య ఖర్చులు, పిల్లల విద్యాభారం మోయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.2026–27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ రెన్యూవల్ ఉత్తర్వులు జారీ చేయలేదని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసినప్పటికీ తమ వివరాలు నమోదు చేయకపోవడంతో వేతనాలు నిలిచిపోయాయని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం మానవీయ కోణంలో పరిశీలించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.






## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి.

- గ్రామ సర్పంచ్ డివై చిన్న నరసింహులు.
- పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల సందర్శన.



**ప్రజా వాయిస్/తాండూర్:** విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం... రుచికరమైన భోజనం అందించాలని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై చిన్న నరసింహులు ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ క్రమంలో పాఠశాల పరిసరాలను పరిశీలించి, మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వాయించొద్దని సూచించారు. విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు కల్పించాలని కోరారు.

## ఎంఎస్ అగర్వాల్ కంపెనీ విస్తరణ నిలిపివేయాలి

- రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల్లో కాలుష్యం తీవ్రం
- గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధుల బారిన ప్రజలు
- విషపూరిత నీటితో పశువులు, చేపల మృతి, భూగర్భ జలాలు కలుషితం
- గర్భిణీలకు అబార్షన్లు, విద్యార్థుల చదువుకు అంతరాయం
- మెదక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**ప్రజా వాయిస్, గజ్వేల్ :** మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల్లో ఎంఎస్ అగర్వాల్ కంపెనీ కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని, విషపూరిత వాయువు, నీరు, శబ్ద కాలుష్యంతో ప్రజలు గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, చర్మవ్యాధులు, క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కంపెనీ విస్తరణ నిలిపివేసి, దాన్ని శాశ్వతంగా తొలగించాలి అని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మెదక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలుష్యం వల్ల గర్భిణీలకు మూడు నెలల్లోనే గర్భస్రావాలు అవుతున్నాయని, విషపూరిత నీరు త్రాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయని, చెరువులు, కుంటల్లో చేపలు చనిపోతున్నాయని, భూగర్భ జలాలు విషపూరితంగా మారి పంటలు పండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ శబ్ద కాలుష్యంతో విద్యార్థులు చదువుకోలేక తమ భవిష్యత్తు అందకారమవుతోందని అన్నారు. రెండు గ్రామాల ప్రజలు తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని భయాందోళనలో ఉన్నారని, కంపెనీ యాజమాన్యం భయానక వాతావరణాన్ని సృష్టించిందని ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ మానవతా దృక్పథంతో రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎంఎస్ అగర్వాల్ కంపెనీని తొలగించాలని గ్రామస్తుల తరఫున కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా గ్రామ పంచాయతీలో 'షాడో' సర్పంచ్ పెత్తనం..

**ప్రజా వాయిస్, చిన్న కోడూర్ :** మండల పరిధిలోని గంగాపూర్ గ్రామ పంచాయతీలో చట్టవిరుద్ధంగా పాలన సాగుతోందని, ఎన్నికైన మహిళా సర్పంచ్‌కు బదులుగా ఆమె భర్త అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అదే గ్రామానికి చెందిన అంతగిరి చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు చిన్నకోడూరు మండలం పరిషత్ అభివృద్ధి అధికారి (మండల ఎంపీడీఓ) కార్యాలయంలో మంగళవారం ఆయన ఒక రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు.ఫిర్యాదుదారుడు చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ గ్రామ పంచాయతీకి 2025లో ఒక మహిళ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే, చట్టప్రకారం సర్పంచే విధులు నిర్వహించాల్సి ఉండగా, ఆమె భర్త తానే సర్పంచ్‌గా చలామణి అవుతూ గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో తీవ్రంగా జోక్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మండల, గ్రామ స్థాయి సమావేశాల్లో సర్పంచ్ భర్త పాల్గొనడమే కాకుండా, తానే స్వయంగా సమావేశాలను సమీక్షిస్తున్నారని ఆరోపించారు. పై అధికారులు తనకు ప్రత్యేకంగా అధికారిక అనుమతులు ఇచ్చారంటూ నమ్మిస్తూ, ఆయన గ్రామ పంచాయతీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.సర్పంచ్ భర్త చట్టవిరుద్ధంగా పాల్గొన్న కొన్ని అధికారిక కార్యక్రమాలకు సంబంధించిన కీలక ఫొటో ఆధారాలను సేకరించి, చంద్రశేఖర్ తన ఫిర్యాదు పత్రానికి జతపరిచారు. ఈ దారుణమైన షాడో పాలనపై తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యుడైన వ్యక్తిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వ్యవస్థను నిలబెట్టి, గంగాపూర్ గ్రామ పంచాయతీకి న్యాయం చేయాలని స్థానిక అధికారులను వేడుకున్నారు. కాగా, ఈ అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎస్. కె. హేమావతి (I.A.S) గారికి మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గారికి కూడా ఈ ఫిర్యాదు తాలూకు నకళ్లను పంపినట్లు చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి లక్ష్యాలు సాధించాలి




**ప్రజా వాయిస్,కోదాడ:** ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎన్ ఆర్ ఎస్ కాలేజ్ చైర్మన్ వద్దె రాజేష్ చౌదరి అన్నారు. మంగళవారం కాలేజ్ లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్ పార్టీలో ఆయన పాల్గొని మాట్లాడారు.విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ దశ కీలకమని ఇక్కడినుండే విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాల సాధన ప్రారంభమవుతుందన్నారు. ఇలాంటి ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థులు రాణించేందుకు తమ కాలేజ్ లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ విద్యార్థులు భయం వీడి సీనియర్ విద్యార్థులతో కలిసిపోవడానికి ఫ్రెషర్ పార్టీ లు ఉపయోగపడతాయని అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్స్ కు మార్గదర్శకులుగా ఉండి వారికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాల రావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీ వీ), వైస్ ప్రిన్సిపల్ పీ ఎస్ ఆర్, పలువురు లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్

**ప్రజా వాయిస్, మహబూబాబాద్ :** వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లాలోని మండల ప్రాథమిక వైద్యాధికారులతో గూగుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గూడూరు, కోమట్ల గూడెం, కొత్తగూడ, తీగల వేణి, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రత్యేకమైన సీజనల్ వ్యాదులలో భాగంగా విష జ్వరాలు, అతిసారం, పాము, తేలు కాటు మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రత్యేకంగా డెంగ్యూ ,మలేరియా జ్వరముల వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించవలసిందిగా సూచిస్తూ, జాతీయ ఆరోగ్య కేంద్రాల పథకాలపై సమీక్షించి, లక్ష్యాలు సాధించాలని సూచించినారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశలు అంగనవాడి సిబ్బంది సమన్వయంతో తల్లి పాల ప్రాముఖ్యత లో కాన్పు కాగానే బిడ్డకు తల్లిపాలు( ముర్రిపాలు) పట్టించవలసిందిగా, ఈ పాలు మొదటి టీకా వలె వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, జ్వరాల నియంత్రణలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా ఉండకుండా డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత, దోమల పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయవలసిందిగా సూచించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శివకుమార్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.




## సంక్షేమం ఇంటింటికీ.. 86 కుటుంబాలకు ప్రభుత్వ భరోసా

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి
- 63 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత
- 23 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం
- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. ప్రతి అర్హుడికి పథకాలు అందేలా కృషి : ఎమ్మెల్యే



**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శంకరంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా 63 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు, 23 మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయ చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక చేయూత అందించడమే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశమని, అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పెద్ద ఆసరాగా నిలుస్తోందని అన్నారు.

"సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అర్హుల ఇంటి గడపకు చేరాలి. చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు కరీంనగర్‌కు చలో...

## చేనేత చైతన్య సభకు భారీగా తరలిరండి..

- **చేనేత సమస్యల పరిష్కారానికి ఐక్యంగా గళమెత్తుదాం.**
- **రాష్ట్ర చేనేత ఐక్యవేదిక..**

**ప్రజా వాయిస్ హుస్నాబాద్ :** తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 5న కరీంనగర్‌లోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించనున్న రాష్ట్ర చేనేత చైతన్య మహా సభను విజయవంతం చేయాలని రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షులు గాజుల భగవాన్ నేత, సలహా మండలి చైర్మన్ చింతకింది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.
ఈ మహాసభకు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత నాయకులు హాజరై చేనేత రంగ అభివృద్ధి, సంక్షేమంపై ప్రసంగించనున్నట్లు తెలిపారు.
చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న డీఆర్ఎఫ్ నిధుల సమస్య, చేనేత భరోసా రెండో విడత నిధుల విడుదల, 2026–27 ఉత్పత్తి లక్ష్యాల జారీ, 60 ఏళ్లు పైబడిన మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు బీమా బకాయిల చెల్లింపు, సహకార సంఘాల బలోపేతం వంటి కీలక అంశాలపై సభలో చర్చించి ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్లు వినిపించనున్నట్లు వెల్లడించారు.
అలాగే చేనేత కార్మికులకు శాశ్వత మార్కెటింగ్ సౌకర్యం, నూలు సరఫరా, పెండింగ్ సంక్షేమ ప్రయోజనాల విడుదల, చేనేత కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు.
చేనేత రంగం బలోపేతానికి చేనేత కార్మికులతో పాటు మొత్తం పద్మశాలి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘాల నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించనున్నట్లు తెలిపారు.
రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పద్మశాలి కులబంధువులు, చేనేత కార్మికులు, మహిళలు, యువత, సహకార సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై చేనేత చైతన్య మహాసభను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా

- **మిర్యాలగూడలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.**
- **సామూహిక అన్నప్రాసన వేడుకలు**




**ప్రజా వాయిస్ మిర్యాలగూడ :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పి. వేణుగోపాలరావు ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్ సెక్టార్ పరిధిలోని పాపపూసల దిబ్బ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాధాన్యంపై తల్లులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా బిడ్డ జన్మించిన గంటలోపు వచ్చే ముర్రిపాలలో ఉండే కొలెస్ట్రాల్ శిశువుకు తొలి టీకా మాదిరిగా రోగనిరోధక శక్తిని అందిస్తుందని తెలిపారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, జననం నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం లేదా ద్రవాలు ఇవ్వకుండా కేవలం తల్లిపాలే అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సామూహిక అన్నప్రాసన వేడుకలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నజీమాబేగం మహమ్మద్, బ్లాక్ కోఆర్డినేటర్ టి. కవిత, అంగన్వాడీ టీచర్లు అరుణ, ఉమా, ధనలక్ష్మి, అంగన్వాడీ హెల్పర్ లక్ష్మీకాంతమ్మతో పాటు గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, స్థానిక మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

## భూ భారతి పోర్టల్ పై అవగాహన అవసరం

### జిల్లా కలెక్టర్ కె. హరిత

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హరిత అధ్యక్షతన అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.
జూనియర్ అసిస్టెంట్లు తహశీల్దార్ కార్యాలయంలోని ధరణి బాధ్యతలతో పాటు భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆపరేటర్‌పై మాత్రమే ఆధారపడకుండా, కార్యాలయ పనులతో పాటు పోర్టల్ నిర్వహణలోనూ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. భూ సేకరణ అంశాలు, దరఖాస్తులు వంటి పనులను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు.




## రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌పై ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలి



**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా :** ప్రజల్లో రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పట్ల గౌరవం, విశ్వాసం మరింత పెరిగేలా అధికారులు పారదర్శకంగా సేవలు అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఏ అవసరం వచ్చినా ముందుగా రెవెన్యూ శాఖనే ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను త్వరితగతిన ప్రజలకు అందించడంలో ముందంజలో ఉండాలని ఆమె స్పష్టం చేశారు.
భూ సేకరణ, మౌలిక వసతుల ప్రాజెక్టుల వేగవంతం జిల్లాలో భూ సేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టీజీ ఐఐసీ (TGIIC) ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన భూ సేకరణను ఆర్డీఓలు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు కింద చేర్యాల, కొమురవెల్లి, కొండపాక, అలాగే గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో కాలువల నిర్మాణానికి కావలసిన భూ సేకరణను తహసీల్దార్లతో కలిసి పూర్తి చేసి, వెంటనే సర్వే ద్వారా అవార్డులు పాస్ చేయాలన్నారు. నేషనల్ హైవే కింద బస్వాపూర్, హుస్నాబాద్ పట్టణ పరిధిలోని భూ సేకరణను వేగవంతం చేయాలని హుస్నాబాద్ ఆర్డీఓను, రీజనల్ రింగ్ రోడ్ (RRR) భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని గజ్వేల్ ఆర్డీఓను ఆదేశించారు.

### భూ భారతి, ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం పట్ల ప్రజల్లో సమగ్ర అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామా పెండింగ్ అప్లికేషన్లను ఆర్డీఓలు, తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణిల ద్వారా అందే ఫిర్యాదులలో అత్యధికం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటాయని, పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని పేర్కొన్నారు.

### ప్రభుత్వ భూముల రక్షణ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ

మండలాల వారీగా నక్షా ప్రకారం ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి, ఆక్రమణలకు గురికాకుండా కఠిన పర్యవేక్షణ వేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ల వివరాలను సేకరించి, నిర్మాణం పూర్తయిన ఇళ్లను అర్హులైన నిజమైన లబ్ధిదారులకు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

### మీసేవ సేవలు, సొంత భవనాల నిర్మాణం

అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం కోసం అనువైన ప్రభుత్వ భూమిని ఎంపిక చేయాలని, ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో అంచనాలు తయారు చేస్తే మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఆదాయ, కుల, నివాస, మరణ ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీఓలు సదానందం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డీసీ వరలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## నల్లగొండ రైతు మహాసభలను విజయవంతం చేయండి..

- **రైతులకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపు**



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ :** 19, 20, 21 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న ఆల్ ఇండియా కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామంలో మహాసభల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మహాసభల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వాల ముందు కార్యాచరణను ప్రతిపాదించే వేదికగా ఈ జాతీయ మహాసభలు నిలుస్తాయని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని దేశవ్యాప్తంగా సాగిన రైతు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచినప్పటికీ, ఇప్పటికీ గిట్టుబాటు ధర చట్టం అమలు కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే గిట్టుబాటు ధర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రైతు ఉద్యమ నాయకులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని, రైతాంగ సమస్యల పరిష్కారంపై జరిగే చర్చలు భవిష్యత్ రైతు హక్కుల సాధనకు దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికారి మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవి నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కందుకూరి రమేష్, నాయకులు నాగరాజు, షరాపరెడ్డి, సైదాచారి, సైదులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ 100 శాతం పూర్తయ్యేలా రాజకీయ పార్టీల సహకారం అవసరం

- **60 శాతం ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తి**
- **మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **ఈఆర్వో సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజావాయిస్, రాజేంద్రనగర్ :** నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు చొరవ తీసుకుని సహకరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఈఆర్వో సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.
మంగళవారం కిస్మత్‌పూర్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.ఇప్పటివరకు నియోజకవర్గంలో 60 శాతం మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను




బీఎల్ఓలకు సమర్పించినట్లు తెలిపారు. మిగిలిన ఆరు రోజుల్లో అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందజేసేలా రాజకీయ పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.ఇంకా తమ వివరాలను మ్యాపింగ్ చేసుకోని ఓటర్లు వెంటనే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమయానికి పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీ నాయకులు ఎన్. ధనుంజయ్,మహమ్మద్ ఖలీద్,శ్రీధర్ రెడ్డి,సోమ శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ గోరికె సురేష్,ప్రభాకర్ రెడ్డి, ఓం ప్రకాష్,మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,బొక్క బాల్ రెడ్డి,నవీన్, తాహెబ్‌తో పాటు ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

- **రికార్డులు లేని 46 వాహనాలు, 20 లీటర్ల మద్యం స్వాధీనం**
- **కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో 45 బైక్‌లు, ఒక ఆటో సీజ్**

**ప్రజా వాయిస్ హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పోలీసులు మంగళవారం భారీ ఎత్తున 'కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం' నిర్వహించారు. ఏసిపి సదానందం పర్యవేక్షణలో చేపట్టిన ఈ తనిఖీల్లో పోలీసులు వివిధ బ్లాకులను క్షుణ్ణంగా సోదా చేశారు. ఈ క్రమంలో ఎలాంటి సరైన పత్రాలు లేని 45 మోటార్ బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీధర్ తెలిపారు.

### మూడు బెల్ట్ షాపులపై కేసులు.. 20 లీటర్ల మద్యం స్వాధీనం


వాహనాల తనిఖీలతో పాటు పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై కూడా పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మూడు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 20 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

### గంజాయి, సైబర్ నేరాలపై ఏసిపి సదానందం హెచ్చరిక

తనిఖీల అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏసిపి సదానందం మాట్లాడారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అమ్మినా లేదా తాగినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు, అత్యవసర సమయాల్లో డయల్ 100 సంప్రదించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి, సరైన పత్రాలతో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. అలాగే అపరిచితులకు, గుర్తింపు కార్డులు లేని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

### తనిఖీల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీసు సేవలకు సంబంధించిన ఉద్యోగ మిత్ర, సురక్ష నేత్ర, షీ సేఫ్ వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ విస్తృత తనిఖీల్లో సిద్దిపేట ఏసిపి సదానందం, హుస్నాబాద్ సీఐ శ్రీధర్, చేర్యాల్ సీఐ రమేష్, ఎస్ఐలు మహేష్, ప్రశాంత్, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సాంప్రదాయాలను కాపాడుకుందాం..

## వైభవంగా బోనాల పండుగను నిర్వహించుకుందాం

- **సిజిఆర్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి..**
- **పోతరాజుల విన్యాసాలు, ఎడ్లబండ్ల ఊరేగింపుతో మారుమోగిన వీధులు..**
- **ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లకు సిజిఆర్ ట్రస్ట్ నగదు బహుమతులు**
- **విజేతలకు రూ.15,000, రూ.10,000.. మిగతా బండ్లకు రూ.5,000 చొప్పున ప్రోత్సాహకం**

**జిన్నారం ప్రజావాయిస్ :** మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను వైభవంగా నిర్వహించుకోవాలని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. గుమ్మడిదల పురపాలక కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల వేడుకలను గ్రామ దేవాలయ కమిటీ, గ్రామ పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శివసత్తుల సిగాలు, పోతరాజుల విన్యాసాల నడుమ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లను కట్టి గ్రామ బొడ్డురాయి నుంచి ఎల్లమ్మ దేవాలయం వరకు కోలాహలంగా ఊరేగించారు.

### సిజిఆర్ ట్రస్ట్ తరపున నగదు బహుమతులు

ఈ సాంప్రదాయాన్ని, గ్రామీణ సంస్కృతిని ప్రోత్సహించే దిశగా సిజిఆర్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి నగదు బహుమతులు, ప్రోత్సాహక విరాళాలను అందజేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లలో పొచుగారి పెంటారెడ్డి మోహన్ రెడ్డి ఎడ్లబండి మొదటి బహుమతిగా రూ.15,000, కురుమ సంఘం ఎడ్లబండి రెండో బహుమతిగా రూ.10,000



అందుకుంది. అలాగే ఊరేగింపులో పాల్గొన్న మిగతా అన్ని ఎడ్లబండ్లకు రూ.5,000 చొప్పున ప్రోత్సాహక విరాళాన్ని అందజేశారు. బహుమతులను తహసీల్దార్ పరమేశం, ఎస్సై అరుణ్ కుమార్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు సదానంద రెడ్డి,వార్డు కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, ట్రస్ట్ సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### కొమురం భీం ఆసిఫాబాద్ ప్రాణహిత-చేవెళ్ల నీటిపై నీలినీడలు...

## ఎప్పటికి పూర్తవుతుందీ ప్రాజెక్టు ?



**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల కల అయిన ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల, సిర్పూర్, బెజ్జూరు తదితర మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, నిధుల మంజూరు, బ్యారేజీ నిర్మాణంపై స్పష్టత లేకపోవడంతో రైతుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి.

### ప్రాజెక్టు నేపథ్యం

మహారాష్ట్ర సరిహద్దులోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించి, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును తొలుత రూపొందించారు. బ్యారేజీ నిర్మాణం తుది దశకు చేరుకున్న సమయంలో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టును ఆకస్మికంగా రద్దు చేసింది. బ్యారేజీ పూర్తయితే తుమ్మిడిహెట్టి నుంచి నెన్నెల మండలం మైలారం గ్రామం వరకు 71.5 కిలోమీటర్ల దూరం మోటార్ల అవసరం లేకుండానే నీరు ప్రవహించే వీలుంది.

### జిల్లాకు ఒరిగే ప్రయోజనాలు

ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందనుంది. కౌటాల మండలంలో ఒక్కటే 10 వేల ఎకరాలకు నీరు అందించే ప్రతిపాదన రూ.10 కోట్ల అంచనాతో సిద్ధంగా ఉంది. ఏళ్లుగా వర్షాధారంగా సాగు చేస్తున్న రైతులకు ఖాయిలీ సాగు దొరికే వీలుంది. తాగునీటి కొరత తీరడంతో పాటు, ప్రాంతంలో ఆర్థిక, వ్యవసాయాభివృద్ధి కొత్త దశలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

### ప్రభుత్వ నిర్లక్ష్యానికి కారణాలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతి, అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారం అవసరం. వాప్కోస్ సంస్థ గతంలో రూపొందించిన సర్వే ఫలితాలను పునఃపరిశీలించి, తుది డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘానికి సమర్పించే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి-సుందిళ్ల అనుసంధానం ద్వారా ప్రాజెక్టు వ్యయాన్ని 10 నుంచి 12 శాతం తగ్గించే యోచనలో ప్రభుత్వం ఉన్నా, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. రెండేళ్లు గడిచినా ఒక్క తట్ట మట్టి కూడా తీయని పరిస్థితి నెలకొంది.

### నిలదీస్తున్న ప్రజాసంఘాలు

గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు రద్దు వెనుక జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ నియమించిన కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చూపుతోందని ప్రశ్నిస్తున్నాయి.

### స్థానిక నేతల నిష్క్రియాత్మకత

జిల్లాలో పోడు భూముల హక్కులు, అటవీ సరిహద్దుల వివాదాలు, అసంపూర్తి ప్రాజెక్టులతో అడవిబిడ్డలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రాణహిత-చేవెళ్ల అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు అడపాదడపా ప్రకటనలు చేయడం తప్ప, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా సమన్వయ కృషి చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిధుల మంజూరు, బ్యారేజీ నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ఆలస్యమవుతూనే ఉన్నాయి.